



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 267 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | గురువారం 18 జూన్ 2026 | పేజీలు : 12 | వెల : 2/-


### తుని చిన్నారి మిస్సింగ్ మిస్టరీపై

# హోం మంత్రి సీరియస్



- ఎంపీ సానా సతీష్ బాబుతో కలిసి దొండవాకలో పర్యటన!
- కన్నీరుమున్నీరవుతున్న తల్లి జ్ఞానేశ్వరిని ఓదార్చిన మంత్రి అనిత, ఎంపీ సతీష్ బాబు.. 'జాహ్నవి'ని తెచ్చే వరకు విశ్రమించం!
- పోలీస్ స్నిఫర్ డాగ్స్, జీపీఎస్ ఆధారాలతో 'రెడ్ జోన్' జల్లెడ.. వదంతులు వ్యాప్తి చేస్తే కఠిన చర్యలని హోంమంత్రి హెచ్చరిక!

భైరవుడు' వదిలిన జీపీఎస్ క్లూస్..

## రంగంలోకి స్నిఫర్ డాగ్స్!

ఈ కేసులో శనివారం మృతి చెందిన పెంపుడు కుక్క 'భైరవుడు' మరణం వెనుక డీహైడ్రేషన్ కారణమని వెటర్నరీ అధికారులు ప్రాథమికంగా భావిస్తున్న ప్పటికీ, ఫోరెన్సిక్ నివేదిక కోసం పోలీసులు వేచి చూస్తున్నారు. కాగా, ఆ కుక్క మెడకున్న జీపీఎస్ ట్రాకర్ రికార్డ్ చేసిన రూట్ మ్యాప్ ఆధారంగా దట్టమైన ముళ్లపొదలు, కొండ రాళ్ల పరిసరాలను పోలీసులు "రెడ్ జోన్"లి గా ప్రకటించారు. బుధవారం కాకినాడ నుంచి వచ్చిన ప్రత్యేక లిస్నిఫర్ డాగ్స్ రంగంలోకి దిగి, చిన్నారి బట్టల వాసన ఆధారంగా ఈ రెడ్ జోన్ పరిసరాలను జల్లెడ పడుతున్నాయి.

**తుని రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా తుని మండలం దొండవాక పంచాయతీ అగ్రహారంలో అదృశ్యమైన రెండేళ్ల చిన్నారి జాహ్నవి ఉదంతం రాష్ట్ర వ్యాప్తంగా పెను సంచలనం సృష్టిస్తున్న నేపథ్యంలో బుధవారం అత్యంత కీలక అధికారిక పర్యటన చోటుచేసుకుంది. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు బుధవారం స్వయంగా దొండవాక గ్రామ శివారు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. చిన్నారి అదృశ్యంతో కంటిమీద కునుకు లేకుండా కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తల్లి



జ్ఞానేశ్వరిని, కుటుంబ సభ్యులను వారు పరామర్శించి ఓదార్చారు. కూడు కోసం పనులు చేసుకునే ఆ పేద కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, పాపను క్షేమంగా తిరిగి తెచ్చే వరకు ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం విశ్రమించబోరని గట్టి భరోసా ఇచ్చారు.

**క్షేత్రస్థాయిలోనే ఎస్పీ బిందు మాధవ్‌తో ఉన్నత స్థాయి సమీక్ష**

ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలోనే కాకినాడ జిల్లా ఎస్పీ జీ. బిందు మాధవ్‌తో హోంమంత్రి వంగలపూడి అనిత, ఎంపీ సానా సతీష్ బాబు కేసు దర్యాప్తు పురోగతిపై సుదీర్ఘ మిగతా .. 2లో..


## కిడ్నాప్ కోణం.. రూ.1 లక్ష రివార్డు!

కుక్క మరణంతో పోలీసులు పూర్తి స్థాయిలో కిడ్నాప్ కోణంపై మరియు పాత కక్షలపై నిఘా పెట్టారు. అనుమానితుల టవర్ డంప్ డేటాతో పాటు, జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న సీసీటీవీ ఫుటేజీలను సైబర్ టీమ్స్ విశ్లేషిస్తున్నాయి. చిన్నారి ఆచూకీని సురక్షితంగా తెలిపిన వారికి జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రకటించిన రూ. 1,00,000 (లక్ష రూపాయల) నగదు బహుమతి ఇంకా కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు.

# అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేయాల్సిందే..

**అధికారులు, ఉద్యోగుల పనితీరుపై 360 డిగ్రీల్లో విశ్లేషణ**

**ఫిర్యాదులను అర్జీదారులే ట్రాక్ చేసుకునేలా కొత్త వ్యవస్థ - ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రతి ఒక్క అధికారి క్షేత్రస్థాయి పర్యటనలు జరిపి తీరాల్సిందేనని ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు స్పష్టం చేశారు. జూలై నెల నుంచి అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు తప్పనిసరిగా చేపట్టాలని ఆదేశించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ "పాలనా బాధ్యతలు చేపట్టి రెండేళ్ళు దాటింది. తప్పులు జరగకుండా యంత్రాంగం అంతా అప్రమత్తంగా ఉండాలి. లోపాలు ఏమైనా ఉంటే వాటిని ఏ విధంగా సరి చేయాలనే అంశం మీద ఫోకస్ పెట్టాను. అధికారులు, ఉద్యోగులు కూడా ఆ దిశగా ఆలోచన చేయాలి. ప్రజలకు సేవలు అందించే విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించవద్దు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటనలు చేయాలి. ఫీల్డు లోని సమస్యలను స్వయంగా పరిశీలిస్తే అధికార యంత్రాంగం మీద ప్రజల్లో మరింత నమ్మకాన్ని పొందగలం. తనిఖీలు చేస్తున్నారనే భావన ప్రజల్లో కలుగుతుంది. ఆ దిశగా ఉన్నతాధికారులు మొదలకుని క్షేత్రస్థాయి అధికారి వరకు అందరూ మిగతా .. 2లో..

### అరుదైన వ్యాధితో బాధపడుతున్న

# అభిమాని నిరంజన్‌ను పరామర్శించిన పవన్ కళ్యాణ్

- ఆరోగ్య పరిస్థితిపై ఆరా.. తల్లిదండ్రులకు భరోసా..
- వైద్య ఖర్చుల నిమిత్తం రూ. లక్ష ఆర్థిక సాయం
- నిరంజన్ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ శ్రీ వెంకటేశ్వరస్వామి తీర్థప్రసాదాలు అందజేత
- వరంగల్ భద్రకాళీ అమ్మవారికి ప్రత్యేక పూజలు

**హనుమాన్ నగర్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రివర్యులు, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. అరుదైన డి.ఎన్.డి అనే జన్యుపరమైన వ్యాధితో బాధపడుతూ ఎదుగుదల లేని స్థితిలో, మంచానికే పరిమితం అయిన యువ అభిమాని కోరికను మన్నించి స్వయంగా అతని నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆర్థిక భరోసాతోపాటు భగవంతుని తీర్థప్రసాదాలు అందజేశారు. తెలంగాణ రాష్ట్రం హనుమకొండ పట్టణంలోని హనుమాన్ నగర్‌కి చెందిన 17 ఏళ్ల నిరంజన్ అరుదైన వ్యాధితో పోరాడుతున్నాడు. తన చివరి కోరికగా పవన్ కళ్యాణ్‌ని కలవాలని అభిలషించారు. తెలంగాణ జనసేన నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రివర్యులు బుధవారం స్వయంగా నిరంజన్ ఇంటికి వెళ్లారు. అతన్ని దగ్గరకు తీసుకుని పరామర్శించారు. తల్లిదండ్రులు పొనుగోటి రాంగోపాల్,



మానసతో మాట్లాడి నిరంజన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యం ఎక్కడ చేయిస్తున్నారు? అతన్ని కాపాడుకోవడానికి ఏం చేయొచ్చు అన్న విషయాలపై మిగతా .. 2లో..

వైకాపా నేతలు ఎంత దూషించినా..

## ఆమె గొంతు నొక్కలేరు

**మంత్రి నారా లోకేష్**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** హోంమంత్రి అనితపై చేసిన అవమానకరమైన, మహిళా ద్వేషపూరిత వ్యాఖ్యలు వైకాపా నిజ స్వరూపాన్ని బహిర్గతం చేస్తున్నాయని మంత్రి నారా లోకేశ్ ధ్వజమెత్తారు. ఐదేళ్ల విఫల పాలనలో శాంతి భద్రతలు, అభివృద్ధిపై ఆ పార్టీ వద్ద సమాధానాలు లేవన్న ఆయన.. వారికి బాగా తెలిసిన పద్ధతులైన దూషణలు, బెదిరింపులు, మహిళా ద్వేషం, కులపరమైన దాడులకు పాల్పడుతున్నారని మండి పడ్డారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న ఒక మహిళను, దళిత నాయకురాలిని లక్ష్యంగా మిగతా .. 2లో..

## తర్వాత వాట్సప్‌నూ బ్యాన్ చేస్తారా?

**కేంద్రం తీరుపై రాహుల్ ఫైర్**



**విశ్వం వాయిస్ న్యూస్ :** నీట్ పునఃపరీక్ష నేపథ్యంలో ప్రముఖ మెసేజింగ్ యాప్ 'టెలిగ్రామ్'పై కేంద్రం నిషేధం విధించడాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తప్పుబట్టారు. కేంద్రం చర్య దొంగను పట్టుకోవడానికి బదులుగా.. బాధితుడి ఇంటి తలుపునకు తాళం వేయడంలా ఉందంటూ ఎద్దేవా చేశారు. నోట్స్, టెస్ట్ సిరీస్‌లు, చర్చలు, ప్రిపరేషన్ కోసం లక్షలాది మంది విద్యార్థులు మిగతా .. 2లో..

## రాబోయే తరాలకు మంచి జరగాలని కోరుకోవడం గొప్పవిషయం

**ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు**



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాబోయే తరాలకు మంచి జరగాలని కోరుకోవడం గొప్ప విషయమని ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అన్నారు. దేశవిదేశాల్లో ఉన్నా చదువుకున్న కళాశాల గురించి ఆలోచించడం బాగుందని కొనియాడారు. రంగరాయ మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉన్న కాకినాడ జీజీహెచ్‌లోని మాతా శిశు సంరక్షణ ఆస్పత్రి మిగతా .. 2లో..

### రాజధాని నిర్మాణానికి.. ఒకే రోజు

## వంద ఎకరాలు ఇచ్చిన రైతులు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజధాని అమరావతి నిర్మాణానికి భూసమీకరణ విధానంలో బుధవారం ఒక్కరోజే 100.885 ఎకరాలను రైతులు సీఆర్‌డీఏకి ఇచ్చి ఒప్పందం కుదుర్చుకున్నారు. తుళ్లూరు, రాయపూడి, లింగాయపాలెం, వెలగపూడి గ్రామాలకు చెందిన 12 మంది రైతులు స్వచ్ఛందంగా రాయపూడిలోని సీఆర్‌డీఏ కార్యాలయానికి మిగతా .. 2లో..

## భారత నావికుల భద్రతే మాకు ముఖ్యం

**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని మోదీ**



**విశ్వం వాయిస్ న్యూస్ :** హర్మూజ్ జలసంధి వద్ద ఎలాంటి ఆంక్షలు ఉండొద్దని, అక్కడ స్వేచ్ఛా వాణిజ్యం జరగాలని ప్రధాని మోదీ అన్నారు. అక్కడ వేలాది మంది భారత నావికుల భద్రతే తమకు ముఖ్యమని, వారికి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ7 సదస్సులో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరిపారు. ప్రధాని మోదీ మాట్లాడుతూ.. పశ్చిమాసియాలో శాంతి కోసం ట్రంప్ కృషి చేశారని, హర్మూజ్ తెరవడంతో ప్రపంచ ఆర్థిక మిగతా .. 2లో..

### అంతరిక్ష యాత్రకు సిద్ధమవుతున్న

## ఇండో-అమెరికన్ వ్యోమగామి



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఇండో-అమెరికన్ వ్యోమగామి అనిల్ మేనన్ అంతరిక్ష యాత్రకు సిద్ధమవుతున్నారు. జులై 14న ప్రారంభం కానున్న అంతర్జాతీయ అంతరిక్ష యాత్రకు అనిల్.. మరో ఇద్దరు వ్యోమగాములు ప్యోటర్ డుబ్రోవ్, అన్నా కికినాలతో కలిసి వెళ్లనున్నారు. వారు 240 రోజుల పాటు కక్ష్యలో గడపనున్నారు. జూన్ 22న అనిల్ మేనన్ ఇంటర్వ్యూలు ఇస్తారని నాసా వెల్లడించింది. భారత్, ఉక్రెయిన్ తల్లిదండ్రులకు జన్మించిన అనిల్.. అమెరికా పౌరుడు. 2021లో ఆయన వ్యోమగామిగా ఎంపికయ్యారు. 2024లో 23 ఆస్ట్రోనాట్ క్లాస్ గ్రాడ్యుయేట్ అయ్యారు. అంతకుముందు హార్వర్డ్ నుంచి న్యూరోబయాలజీలో బ్యాచిలర్ డిగ్రీ, మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

తుని చిన్నారి మిస్సింగ్ మిస్టరీపై

# హోంమంత్రి సీరియస్

సమీక్ష నిర్వహించారు. సాంకేతిక ఆధారాలతో పాటు గ్రౌండ్ లెవెల్‌లో ప్రత్యేక బృందాలు జరుపుతున్న గాలింపు చర్యల వివరాలను ఎస్పీని అడిగి తెలుసుకున్నారు. కేసు దర్యాప్తులో ఎక్కడా అలసత్వం వహించకుండా, అన్ని కోణాల్లోనూ శోధనను మరింత వేగవంతం చేయాలని పోలీసు అధికారులను హోంమంత్రి ఆదేశించారు.

**పాపను క్షేమంగా అప్పగించడమే లక్ష్యం: ఎంపీ సానా సతీష్ బాబు**

ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు, తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు సానా సతీష్ బాబు మీడియాతో మాట్లాడుతూ.. చిన్నారి జాహ్నవి అదృశ్యం ఘటన తమను తీవ్రంగా కలిచివేసిందన్నారు. "కూతురు కనిపించక పోవడంతో ఆ తల్లి పడుతున్న నరకయాతన వర్ణనాతీతం. పాపను క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించడమే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం" అని స్పష్టం చేశారు. చిన్నారి కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం పూర్తి స్థాయిలో వారి వెంటే ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రజలు కూడా ఎలాంటి వదంతులను నమ్మకుండా అధికారుల దర్యాప్తునకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

**యూట్యూబ్, సోషల్ మీడియా వదంతులపై హోంమంత్రి ఆగ్రహం!**

అనంతరం హోంమంత్రి అనిత మాట్లాడుతూ.. రెండేళ్ల పసికందు అదృశ్యమవడం అత్యంత బాధాకరమైన ఘటన అని పేర్కొన్నారు. పాప మిస్సైన విషయం తెలిసిన వెంటనే పోలీసులు అప్రమత్తమై గాలింపు చర్యలు ప్రారంభించారని, ప్రతిరోజూ ఈ అంశంపై ఉన్నతస్థాయిలో మానిటరింగ్ జరుగుతోందని వెల్లడించారు. ఇదే సమయంలో చిన్నారి మిస్సింగ్ కేసుపై సోషల్ మీడియా, కొన్ని యూట్యూబ్ ఛానళ్లలో జరుగుతున్న అసత్య ప్రచారాలపై హోంమంత్రి తీవ్ర ఆందోళన, ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి తప్పుడు కథనాలు, నిరాధార ఆరోపణలు ప్రజల్లో తీవ్ర గందరగోళాన్ని సృష్టిస్తాయని హెచ్చరించారు. బాధ్యతారాహిత్యంగా వదంతులు ప్రచారం చేసే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు.

# అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేయాల్సిందే..

పని చేయాలి. వచ్చే నెల నుంచి ప్రతి అధికారి ఫీల్డుకు వెళ్లాల్సిందే. వారంలో మూడు రోజుల పాటు క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలని గతంలోనే చెప్పాం. దాన్ని తూచా తప్పకుండా అమలు చేయాలి. జిల్లా కలెక్టర్లు ప్రతి నియోజకవర్గాన్ని నాలుగు సార్లు సందర్శించాలని సూచించాం. దాన్ని పక్కాగా అమలు చేయాలి. అలాగే నియోజకవర్గాల నోడల్ అధికారులు నెలలో ఒకే మండలాన్ని నాలుగు సార్లు సందర్శించాలి. అధికారులు, ఉద్యోగుల పనితీరు మీద 360 డిగ్రీల్లో విశ్లేషిస్తాం."అని ముఖ్యమంత్రి చెప్పారు.

**దేవాదాయ శాఖ పనితీరు మరింత మెరుగవ్వాలి...**

"దేవాలయాల్లో భక్తులకు మరింత సేవలు అందించేలా దేవదాయ శాఖ మరింత ఫోకస్ పెట్టాల్సిన అవసరం కన్పిస్తోంది. దేవదాయ శాఖ ఉద్యోగుల పనితీరు మరింత మెరుగుపడాలి. అన్ని శాఖల్లోని ఉద్యోగుల పనితీరు ఎప్పటికప్పుడు మెరుగుపడాలి. ఈ మేరకు ఉద్యోగులకు అవసరమైన శిక్షణ ఇప్పించాలి. పరిపాలనలో సింగపూర్ దేశం వినూత్న విధానాలను అవలంభిస్తోంది. పరిపాలన విషయంలో ఆ దేశ విధానాలను పరిశీలించాలి. రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో మొత్తంగా 11,600 గుంతలు ఉన్నట్టు గుర్తించాం. వీటిల్లో 79 శాతం గుంతలను పూడ్చాం. మిగిలిన రోడ్లను కూడా త్వరితగతిన మరమ్మత్తులు చేపట్టాలి. ముఖ్యంగా అర్బన్-రూరల్ కనెక్టివిటీ రోడ్లల్లో మరమ్మత్తులు త్వరగా చేపట్టాలి. అలాగే రోడ్ల నిర్మాణం, మరమ్మత్తులకు సంబంధించి ఆర్ అండ్ బి మున్సిపల్ శాఖలు సమన్వయంతో పని చేయాలి."అని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

**గవర్నెన్సుకు టెక్నాలజీ అనుసంధానం... కలిసి పని చేసేందుకు గూగుల్ అంగీకారం**

"డేటా డ్రివెన్ గవర్నెన్సులో గూగుల్ మనతో కలిసి పని చేయడానికి అంగీకరించింది. వాణిజ్య పన్నుల శాఖ ఇప్పటికే గూగుల్ తో కలిసి పని చేస్తోంది. ఆ దిశగా మిగిలిన శాఖల్లో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలి. పీజీఆర్ఎస్ లో ప్రజలిచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి. ఈ మేరకు అర్జీదారులే స్వయంగా వారి అర్జీలను ట్రాక్ చేసుకునే అవకాశం కల్పించాలి. తామిచ్చిన ఫిర్యాదు ఏ మేరకు పరిష్కారమవుతోందోననే అంశాన్ని అర్జీదారులకు అర్థమయ్యేలా ట్రాకింగ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలి."అని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమావేశంలో సీఎస్ సాయి ప్రసాద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అభిమాని నిరంజన్‌ను పరామర్శించిన పవన్ కళ్యాణ్

ఆరా తీశారు. ధైర్యంగా ఉండాలని భగవంతుడి ఆశీస్సులు బాబుకి ఉంటాయని చెప్పి కుటుంబ సభ్యులకు మనో ధైర్యం నింపారు. శ్రీ వెంకటేశ్వరస్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించి భగవంతుని ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ. లక్ష ఆర్థిక సాయం అందజేశారు. నిరంజన్ ఆరోగ్యం కోసం వరంగల్ విఖ్యాత భద్రకాళి అమ్మవారి ఆలయంలో ప్రత్యేకంగా పూజలు చేయిస్తానని తెలిపారు.

**చలించిపోయిన పవన్ కళ్యాణ్**

నిరంజన్ ను చూసేందుకు వచ్చిన పవన్ కళ్యాణ్ ఆతనితో చాలా సమయం గడిపారు. ఇంట్లోకి వచ్చిన పవన్ కళ్యాణ్ లేవలేని స్థితిలో ఉన్న అభిమానిని చూసి చలించిపోయారు. అతని మంచంపై కూర్చుని ఆత్మీయంగా హత్తుకున్నారు. నుదిటిపై ముద్దు పెట్టి ఆప్యాయంగా పలకరించారు. 'చిన్ననాటి నుంచి మీరంటే అభిమానం' అని నిరంజన్ చెప్పిన మాటలు విని కదలిపోయారు. తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి తెప్పించిన వస్త్రాన్ని అతనికి కప్పి, కళ్యాణం అక్షతలు ఇచ్చి ఆశీర్వదించారు. భద్రకాళి అమ్మవారి వెండి ప్రతిమకు ఆలయంలో పూజ చేయించి కుటుంబ సభ్యులకు అందజేస్తానని తెలిపారు. నిరంజన్ ఆరోగ్యంగా ఉన్న సమయంలో పవన్ కళ్యాణ్‌ని అనుకరిస్తూ చేసిన డాన్సుల తాలూకు వీడియోలు, ఫొటోలను తిలకించారు. అంతా తనని చోటా గబ్బర్ సింగ్ అని పిలుస్తారని నిరంజన్ చెప్పాడు.

**కుటుంబ జీవనోపాధికి క్యాంటీన్**

ఈ సందర్భంగా నిరంజన్ ఓ కుక్క పిల్ల బొమ్మ చూపి పెంచుకోవాలని ఉందని చెప్పగా, కొని పంపుతానని హామీ ఇచ్చారు. కుక్కను పెంచుకోవడానికి ఇంటి ఓనర్స్ అనుమతి కావాలని నిరంజన్ తండ్రి చెప్పగా, స్వయంగా ఆ ఇంటి ఓనర్స్‌ని పిలిపించి మాట్లాడారు. నిరంజన్ తల్లిదండ్రులు వృత్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో కాకతీయ ఆసుపత్రి క్యాంటిన్లో పని చేసేవారమని చెప్పగా, వారి జీవనోపాధి మెరుగుపర్చేందుకు క్యాంటిన్ పెట్టించాలని జనసేన తెలంగాణ రాష్ట్ర నాయకులకి దిశానిర్దేశం చేశారు. రంజన్ పరామర్శ పూర్తయిన వెంటనే పవన్ కళ్యాణ్ నేరుగా వరంగల్ భద్రకాళి అమ్మవారి ఆలయానికి బయలుదేరి వెళ్లారు. పవన్ కళ్యాణ్‌తోపాటు జనసేన పార్టీ తెలంగాణ ఇంఛార్జ్ శంకర్ గౌడ్, పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, పార్టీ నాయకులు రాధారం రాజలింగం, ఆర్ కె సాగర్ తదితరులు ఉన్నారు.

# ఆమె గొంతు నొక్కలేరు

చేసుకోవడం అనుకోకుండా జరిగిన ఘటన కాదన్నారు. ఇది వైకాపా ఆధ్వర్యంలో పెంచి పోషించిన విషపూరిత రాజకీయ సంస్కృతిని ప్రతిబింబిస్తోందని చెప్పారు. అనిత.. కష్టపడే తత్వానికి, ధైర్యానికి, ప్రజాసేవకు నిదర్శనమని పేర్కొన్నారు. వైకాపా నాయకులు ఎంతగా దూషించినప్పటికీ.. ఆమె సాధించిన విజయాలను తగ్గించలేరని, ఆమె గొంతు నొక్కలేరని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఇలాంటి ద్వేషపూరిత రాజకీయాలను పదే పదే తిరస్కరించారన్నారు. అనితతో పాటు ప్రతి మహిళకు, ప్రతి దళితుడికి వైకాపా క్షమాపణ చెప్పాలని లోకేశ్ డిమాండ్ చేశారు.

# తర్వాత వాట్సప్‌నూ బ్యాన్ చేస్తారా?

ఎప్పటినుంచో టెలిగ్రామ్‌ను ఉపయోగిస్తున్నారని.. దీనిపై నిషేధం విధించడం వల్ల వారు నష్టపోయే ప్రమాదముందని పేర్కొన్నారు. అసలు ఈ ఆలోచన పేపర్ లీక్‌లు అరికట్టడానికి ఎలా ఉపయోగపడుతుందని ప్రశ్నించారు. నిందితులు టెలిగ్రామ్ కాకుంటే వాట్సప్‌లోనూ పేపర్లు లీక్ చేస్తారని అన్నారు. అలా అని వాట్సప్‌ను కూడా బ్యాన్ చేస్తారా? అంటూ ప్రశ్నించారు. ఈ నిషేధం తీరు పరీక్షల్లో మోసాలకు పాల్పడే పేపర్ లీక్ నెట్‌వర్క్‌లను కాకుండా, విద్యార్థులనే లక్ష్యంగా చేసుకున్నట్లుగా ఉందని రాహుల్ ఆక్షేపించారు. నీట్ అభ్యర్థులకు జరిగిన అన్యాయం నుంచి దృష్టి మరల్చడానికే కేంద్రం ఈ ఎత్తుగడ వేసిందని విమర్శించారు. దేశంలో పదేపదే పేపర్ లీక్‌లకు పాల్పడుతున్న నిందితులపై చర్యలు తీసుకోవడంలో మోదీ యంత్రాంగం విఫలమైందన్నారు. ప్రభుత్వ కనుసన్నల్లోనే పేపర్ లీక్ మాఫియా నడుస్తోందని.. దానిని కప్పిపుచ్చుకొనేందుకే పరీక్ష కేంద్రాల వద్ద భద్రతా బలగాలను మోహరించడం, ప్రశ్నపత్రాలను వైమానిక దళం ద్వారా పంపించడం వంటి నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం మాట వినకపోతే తమ హక్కులను ఎలా సాధించుకోవాలో యువతకు తెలుసని అన్నారు.

# రాబోయే తరాలకు మంచి జరగాలని కోరుకోవడం గొప్పవిషయం

నిర్మాణానికి పూర్వ విద్యార్థులు రూ.60కోట్ల విరాళాలు ఇచ్చారు. బుధవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో దాతలను సన్మానించారు. ఈ కార్యక్రమానికి రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, కిమ్స్ వ్యవస్థాపకుడు బొల్లినేని భాస్కరరావు, రంగరాయ మెడికల్ కళాశాల పూర్వవిద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణరాజు మాట్లాడారు. ఆస్పత్రి నిర్మాణం కోసం రంగరాయ మెడికల్ కళాశాల పూర్వవిద్యార్థులు రూ.60కోట్లు సేకరించారని.. వారి సేవలను రానున్న తరాలు గుర్తుంచుకుంటాయన్నారు. ఈ కార్యక్రమం మరెంతో మంది పూర్వవిద్యార్థులకు స్ఫూర్తిదాయకం కావాలన్నారు.

రాజధాని నిర్మాణానికి.. ఒకే రోజు

# వంద ఎకరాలు ఇచ్చిన రైతులు

వచ్చి అదనపు కమిషనర్ భార్గవతేజ్ ఆధ్వర్యంలో అధికారులకు పత్రాలు అందజేశారు. రాజధాని నిర్మాణానికి కొందరు రైతులు భూములు ఇవ్వకపోవడంతో అధికారులు వారితో చర్చించి భూసమీకరణ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. దీంతో రాజధాని అభివృద్ధిలో భాగస్వాములు కావడానికి రైతులు ముందుకొచ్చారు. తుళ్లూరు రైతులు 9.76 ఎకరాలు, రాయపూడి నుంచి 31.005, లింగాయపాలెం రైతులు 16.90, వెలగపూడి రైతులు 43.22 ఎకరాలు ఇచ్చారు. గురువారం మరికొందరు రైతులు భూసమీకరణలో భూములు ఇవ్వడానికి రానున్నట్లు అధికారులు తెలిపారు.

# భారత నావికుల భద్రతే మాకు ముఖ్యం

వ్యవస్థకు మేలు జరిగిందన్నారు. ఇరు దేశాల మధ్య త్వరలో వాణిజ్య ఒప్పందం జరగనుందని చెప్పారు.

**భారత్‌కు అండగా ఉంటాం - ట్రంప్**

ప్రధాని మోదీతో భేటీ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మోదీ అధికారంలో ఉన్నంత కాలం ఎవరైనా దాడి చేస్తే.. భారత్‌కు అమెరికా అండగా ఉంటుందని నవ్వుతూ చెప్పారు. ప్రధాని మోదీ తనకు చిరకాల మిత్రుడని, బేరసారాల్లో ఆయన నిక్కచ్చిగా ఉంటారని అన్నారు. పెట్టుబడుల విషయంలో ఆయన సహకరిస్తున్నారని, అందుకు అభినందిస్తున్నామన్నారు. నేవీ సిబ్బంది భద్రత విషయంలో భారత్‌తో కలిసి పని చేస్తామన్నారు. భవిష్యత్తులో భారత్‌లో పర్యటిస్తానని అన్నారు.

అంతరిక్ష యాత్రకు సిద్ధమవుతున్న

# ఇండో-అమెరికన్ వ్యోమగామి

స్టాన్‌ఫోర్డ్ నుంచి మెకానికల్ ఇంజినీరింగ్, మెడికల్‌లలో మాస్టర్ డిగ్రీలను అందుకున్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన ఈయన వ్యోమగామిగానే కాకుండా ఎమర్జెన్సీ మెడిసిన్ ఫిజీషియన్, మెకానికల్ ఇంజినీర్, అమెరికా స్పేస్‌ఫోర్స్ కర్నల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. వ్యోమగామి కాకముందు అనిల్ నాసా ఎక్స్‌పెడిషన్ ఫ్లైట్ సర్జన్‌గా పనిచేశారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోని వ్యోమగాములకు సహకరించేవారు. 2021లో నాసా తన వ్యోమగాముల బృందంలో అనిల్‌ను ఎంపిక చేసింది. రెండేళ్ల శిక్షణ తర్వాత 2024లో ఆయన వ్యోమగామిగా పట్టభద్రుడయ్యారు. నాటినుంచి కక్ష్యలోకి తన మొదటి అంతరిక్ష యాత్ర కోసం సిద్ధమవుతున్నారు.

గాదె సాయికృష్ణ అదృశ్యంపై

# సీఐ నాగరాజు సస్పెన్షన్

**సీనియర్ ఐపీఎస్ అధికారితో దర్యాప్తునకు ఆదేశం**

**ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష - సమీక్షలో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** విజయవాడ కృష్ణలంకకు చెందిన గాదె సాయికృష్ణ అదృశ్యం ఘటనను ప్రభుత్వం సీరియస్ గా తీసుకుంది. ఈ వ్యవహారంలో సంబంధిత పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజును సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ ఘటనపై సచివాలయంలో సీఎం చంద్రబాబు పోలీసు ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సమీక్షకు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హాజరయ్యారు. సింగపూర్ పర్యటన ముగించుకుని సచివాలయానికి వచ్చిన వెంటనే పోలీస్ ఉన్నతాధికారులతో సీఎం సమావేశమయ్యారు. ఘటనకు సంబంధించిన వివరాలను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సహా పోలీస్ ఉన్నతాధికారులు వివరించారు. సాయికృష్ణ ఘటనపై ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఐ నాగరాజుపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ఆదేశాలు ఇచ్చారు. దీనిపై సీనియర్ ఐపీఎస్ అధికారితో దర్యాప్తు చేయాలని సీఎం స్పష్టం చేశారు. నిష్పక్షపాతంగా దర్యాప్తు జరగాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. బాధ్యులపై కఠినంగా చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనలు చేశారు. ఈ సమావేశానికి సీఎస్ సాయి ప్రసాద్, ఇంటెలిజెన్స్ చీఫ్ మహేష్ చంద్ర లడ్హా విజయవాడ సీపీ రాజశేఖర్ బాబు తదితరులు హాజరయ్యారు.

చేనేత కార్మికులు, కళాకారులకు


# రాష్ట్ర స్థాయి పురస్కారాలివ్వాలి

**సీఎం చంద్రబాబుకు మంత్రి సత్యకుమార్ యాదవ్ వినతి**

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలోని చేనేత కార్మికులు, కళాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు రాష్ట్ర స్థాయి చేనేత పురస్కారాలివ్వాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారంనాడు ముఖ్యమంత్రికి మంత్రి సత్యకుమర్ యాదవ్ లేఖ రాశారు. "ఆంధ్రప్రదేశ్ చేనేత రంగం రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలుస్తోంది. ధర్మవరం, ఉప్పాడ, మంగళగిరి, చీరాల, పెడన, పొందూరు, శ్రీకాళహస్తి, బొబ్బిలి, భట్టిప్రోలు, మదనపల్లె వంటి ప్రాంతాల చేనేత ఉత్పత్తులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయి. కేంద్ర ప్రభుత్వం జాతీయ చేనేత పురస్కారాల ద్వారా ప్రతిభావంతులైన చేనేతలను సత్కరిస్తోంది. ఇదే తరహాలో రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక పురస్కారాలను ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉంది. దీంతో చేనేత కార్మికులకు గౌరవం పెరగడంతో పాటు యువతలో ఈ వృత్తిపట్ల ఆసక్తి పెరుగుతుంది. ప్రతి ఏడాది ఆగస్టు 7న నిర్వహించే జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి పురస్కారాలను ప్రదానం చేయాలి. చేనేతలు, డిజైనర్లు, కళాకారులకు ఇది గొప్ప ప్రోత్సాహంగా నిలుస్తుంది. చేనేత రంగం రాష్ట్ర గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోంది. ఈ ప్రతిపాదనను సానుకూలంగా పరిశీలించి అమలు చేయాలి" అని ముఖ్యమంత్రిని మంత్రి సత్యకుమార్ యాదవ్ లేఖలో కోరారు. కాగా, పద్మశ్రీ అవార్డు గ్రహీత అంజయ్య, ధర్మవరానికి చెందిన జేఆర్ సిల్క్ చీరల సంస్థ యజమాని జింకా రామాంజనేయులు రాష్ట్రంలో చేనేత పురస్కారాలివ్వాలని కోరుతూ సమర్పించిన వినతిపత్రాన్ని కూడా ముఖ్యమంత్రికి పంపినట్లు మంత్రి నేడొక ప్రకటనలో తెలిపారు.

# జోన్-2 రీజనల్ జాయింట్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన పి.తిమ్మప్ప

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** సమాచార పౌర సంబంధాల శాఖ జోన్-2, విజయవాడ ప్రాంతీయ సంయుక్త సంచాలకులుగా (రీజినల్ జాయింట్ డైరెక్టర్) పి. తిమ్మప్ప బుధవారం అధికారికంగా సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకుల ఆదేశాల మేరకు బాధ్యతలు స్వీకరించారు. నగరంలోని ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ లోని కమిషనరేట్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించగా, శాఖకు చెందిన పలువురు అధికారులు, సిబ్బంది ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తిమ్మప్ప మాట్లాడుతూ... సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, డైరెక్టర్ కేఎస్ విశ్వనాథన్, తోటి అధికారులు, కార్యాలయ సిబ్బంది, జోన్ -2 పరిధిలోని డి.ఐ.పి.ఆర్.ఓ లు, డిప్యూటీ డైరెక్టర్లు, డీఈ లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, ఏఈ లు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారుల (డీఐపీఆర్వోలు), పిఆర్వోలు, ఇంజనీరింగ్ సిబ్బంది సహకారం, సమన్వయంతో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మీడియా సమన్వయంతో



ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరేలా సమాచార పౌర సంబంధాల శాఖ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రభుత్వ విధానాలు, సంక్షేమ పథకాల ప్రచారాన్ని మరింత సమర్ధవంతంగా, ప్రజలకు చేరువయ్యేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేస్తానని పి.తిమ్మప్ప తెలియజేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జర్నలిజం లో పీజీ పూర్తి చేసి ఏపీ పబ్లిక్ సర్వీసు కమిషన్ ద్వారా 1996 లో సమాచార శాఖ పిఆర్వో గా చేరిన తరువాత 30 సంవత్సరాల సర్వీసులో అనంతపురం, కడప, కర్నూలు, తిరుపతి, తిరుమల, చిత్తూరు, హైదరాబాద్ సెక్రటేరియట్ లో పనిచేసారు. సమాచార శాఖ మాజీ మంత్రివర్యులు పల్లె రఘునాథరెడ్డి ఓఎస్డీ గా, సమాచార శాఖ కమిషనరేట్, కాకినాడ ఐ అండ్ పీ ఆర్ డీడీ గా పలు హోదాల్లో పనిచేయడంతోపాటు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నుంచి ఉత్తమ అధికారిగా, 15 సార్లు ఉత్తమ అధికారిగా వివిధ కలెక్టర్ల నుంచి అవార్డులు పొంది, ఇటీవల జేడీగా ప్రభుత్వ ఉత్తర్వులతో పదోన్నతి, పోస్టింగ్ ఆర్డర్స్ తో ఆర్ జె డి జోన్ -2 గా ఉమ్మడి కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల పరిధిలోని 8 జిల్లాలకు సమాచార శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కార్యాలయ అధికారులతో, సిబ్బందితో సమావేశమై, ప్రస్తుతం అమలులో ఉన్న కార్యక్రమాలు, పెండింగ్‌లో ఉన్న పనులు, శాఖా పరమైన ప్రాధాన్యత అంశాలపై సమీక్ష నిర్వహించి, సమన్వయంతో పనిచేసి శాఖ పనితీరును మరింత మెరుగుపర్చాలని పి. తిమ్మప్ప సూచించారు.






న్యూఢిల్లీలో జరిగిన వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ 2026 సమావేశానికి అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి హాజరయ్యారు.

# ఎడిటర్ వాయిస్

## జగన్ ఆరాటం.. నాయకుల పోరాటం?

వైసీపీ అధినేత వైఎస్ జగన్ అయితే తెగ ఆరాటపడుతున్నారు. ఆయన గత కొంతకాలంగా చెబుతూ వస్తున్నారు సర్ ప్రక్రియ విషయంలో జాగ్రత్తగా ఉండాలని. సర్ ద్వారా పెద్ద ఎత్తున ఓట్లను తొలగిస్తారు అని అంటున్నారు. నియోజకవర్గానికి అయిదు వేల ఓట్లు అలాగే బూత్ లెవెల్ లో యాభై ఓట్లు వైసీపీని టార్గెట్ చేసుకున్నారు అని కూడా ఆయన అంటున్నారు. ఈ విషయంలో అధికారంలో కూటమి ప్రభుత్వం ఉంది కాబట్టి పూర్తి అప్రమత్తంగా ఉండాలని జగన్ కోరుతున్నారు.

**మీదే బాధ్యత అంటూ :** ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గం కో ఆర్డినేటర్లు తమ బాధ్యతగా సర్ ప్రక్రియని మోనిటరింగ్ చేయాలని జగన్ కోరుతున్నారు. లేకపోతే తీవ్ర స్థాయిలో నష్టపోతామని కూడా జగన్ స్పష్టంగా చెబుతున్నారు. తాజాగా జగన్ మరో మారు ఇదే తరహా హెచ్చరికలను పార్టీ నేతలకు జారీ చేశారు. ఒక్క ఓటు సర్ ప్రక్రియలో తొలగించినా తిరిగి ఆ ఓటుని చేర్చడం బహు కష్టమని సీనియర్ నాయకుల భేటీలో జగన్ పేర్కొన్నారు. సర్ ప్రక్రియని అంతా అర్థం చేసుకోవాలని జగన్ సూచించారు.

**నాలుగు వారాలు కీలకం :** ఏపీలో సర్ ప్రక్రియ మొదలైపోయింది. జూన్ 15 నుంచి జూలై 15 వరకూ నెల రోజుల పాటు సర్ ప్రక్రియ సాగుతుంది. ఆ తరువాత ముసాయిదా జాబితా విడుదల చేస్తారు. అయితే ముసాయిదాలో తప్పు ఒప్పులు చూసుకుని పోయిన ఓట్లను చేర్పించడం కష్టమవుతుందని అంటున్నారు. అది ఒక పెద్ద ప్రహ్సనం. అంతే కాదు అతి పెద్ద తతంగంగా ఉంటుందని అంటున్నారు. అందువల్ల ఈ నాలుగు వారాలే కీలకమని జగన్ పదే పదే చెబుతున్నారు. ప్రతీ ఒక్క బూత్ లెవెల్ ఏజెంట్ కూడా కష్టపడాలని వారి వెంట నియోజకవర్గం ఇంచార్జి తప్పనిసరిగా ఉండాలని కూడా జగన్ సూచిస్తున్నారు.

**బాబుతో జాగ్రత్త :** ఇక ఏపీలో చంద్రబాబుతో జాగ్రత్త అని కూడా జగన్ అంటున్నారు. బాబు వ్యూహాలలో ఆరితేరిన వారు అని అందువల్ల వైసీపీ ఓట్లు గల్లంతు కాకుండా కంటికి రెప్పలా కాచుకోవాల్సిన అవసరం ఉందని జగన్ అంటున్నారు. ఇక వైసీపీ ఓట్లను పెద్ద ఎత్తున తీసేయడానికి కూటమి కుట్ర చేస్తోంది అని కూడా జగన్ ఆరోపిస్తున్నారు. గ్రౌండ్ లెవెల్ లోకి వైసీపీ యంత్రాంగం మొత్తం దిగితేనే తప్ప సర్ లో వైసీపీ ఓట్ల గల్లంతుని అడ్డుకోలేమని జగన్ గట్టిగా చెబుతున్నారు. నిరంతరం సమీక్షలు కూడా చేయాలని జగన్ కోరుతున్నారు.

**సీరియస్ గానేనా :** అయితే జగన్ ఆరాటం చాలానే ఉంది కానీ నాయకుల పోరాటం ఆ లెవెల్ లో ఉందా అన్న చర్చ సాగుతోంది. వైసీపీ ఓట్లను రక్షించుకోవాలని జగన్ ఎంత చెబుతున్నా గ్రౌండ్ లెవెల్ కి వచ్చేసరికి ఆ సీరియస్ నెస్ ఎంత అన్న చర్చ కూడా పార్టీలో సాగుతోంది. పార్టీలో ఇంకా యాక్టివ్ నెస్ రాకపోవడం ఒక కారణం అయితే ఇంత చేసినా రేపటి ఎన్నికల్లో తమకు టికెట్ దక్కుతుందా లేదా అన్న డౌట్ కూడా నేతలకు ఉందని అంటున్నారు. మరో వైపు క్యాడర్ లో ఇంకా నిరాశ పోలేదని అంటున్నారు. ఈ రెండేళ్లలో క్యాడర్‌ని దగ్గర తీసి కనీసం సమీక్షలు అయినా నిర్వహించకపోవడం వల్లనే ఆ ప్రభావం ఇపుడు పడుతోందా అన్న చర్చ సాగుతోంది. మొత్తానికి చూస్తే అవతల టీడీపీ పూర్తి జోష్ లో ఉంది. ప్రతీ ఓటూ మనదే కావాలని పట్టుదలగా ఉంది. వైసీపీ కూడా పందెం కోడిలా తలపడినపుడే సర్ ప్రక్రియలో ఓట్లు గల్లంతు కావు. మరి రెండు రోజులుగా సర్ సాగుతోంది. వైసీపీ హడావుడి అయితే ఇంకా మొదలు కాలేదనే అంటున్నారు. చూడాలి మరి పార్టీ నేతలు ఏ రకంగా రంగంలోకి దిగుతారో.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## విజయవాడ రెయిన్‌బో చిల్డ్రన్ ఆసుపత్రిలో అగ్ని ప్రమాదం



**కరెన్సీనగర్, విశ్వం వాయిస్ న్యూస్ :** విజయవాడ రెయిన్‌బో చిన్నపిల్లల ఆసుపత్రిలోని అత్యవసర వార్డులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వార్డు లోని ఎలక్ట్రికల్ బోర్డులో విద్యుదాఘాతం కారణంగా దట్టమైన పొగలు అలముకున్నాయి. అకస్మాత్తుగా పొగలు, మంటలు వ్యాపించడంతో రోగులు ఆందోళన చెందారు. ఆసుపత్రి ప్రాంగణంలో కేకలు, ఆర్తనాదాలతో కాసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. ప్రమాద తీవ్రతను గమనించిన ఆసుపత్రి వైద్యులు, నర్సింగ్ సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా ఆర్పివేశారు. అగ్ని ప్రమాదంపై సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించడం వల్ల ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని, అంతా సురక్షితంగా ఉన్నారని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

## ఈదురుగాలులతో భారీ వర్షం

### కారుపై ప్రహరీ గోడ కూలి ఇద్దరి మృతి



**దేవరకద్ర గ్రామీణం, విశ్వం వాయిస్ న్యూస్ :** మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రలో ఈదురుగాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించి ఇద్దరి ప్రాణాలను బలితీసుకుంది. కారుపై ప్రహరీగోడ కూలడంతో జగన్నాథరెడ్డి, సంతోష్ మృతిచెందారు. ఎస్సై భాస్కర్‌రెడ్డి, స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. దేవరకద్ర మండలంలోని చౌదర్‌పల్లి, బల్సుపల్లి, దేవరకద్ర, పెద్దగోప్లాపూర్ గ్రామాల్లో భారత్‌మాల రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఈ పనుల నిమిత్తం తిరుపతి నుంచి జగన్నాథరెడ్డి (40), పశ్చిమబెంగాల్ నుంచి సంతోష్(35) వచ్చి కాంట్రాక్టర్ కింద పనిచేస్తున్నారు. జగన్నాథరెడ్డి అకౌంటెంట్‌గా, సంతోష్ డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. బుధవారం సాయంత్రం ఈదురుగాలులు, వడగళ్ల వర్షం కురవడంతో పనిముగించుకొని అద్దెకు ఉంటున్న ఇంటి వద్దకు చేరుకున్నారు. భారీగా వర్షం కురుస్తుండటంతో ఇద్దరూ కారులోనే కూర్చొని ఉన్నారు. అదే సమయంలో భారీగా ఈదురుగాలులు వీయడంతో పక్కనే ఉన్న ప్రహరీ గోడ కూలి కారుపై పడింది. దీంతో కారు పూర్తిగా ధ్వంసమైంది. అందులో జగన్నాథరెడ్డి, సంతోష్ ఇరుక్కుపోయారు. గమనించిన స్థానికులు.. వారిని బయటకు తీసి చికిత్స నిమిత్తం 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. మార్గంమధ్యలోనే వారు మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఘటనాస్థలాన్ని స్థానిక ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పరిశీలించారు.

### బరితెగించిన దొంగలు..

## ఏకంగా ఏటీఎంనే ఎత్తుకెళ్లారు



**బుక్కరాయసముద్రం, విశ్వం వాయిస్ న్యూస్ :** అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రంలో ఎస్‌బీఐ ఏటీఎం చోరీ ఘటన కలకలం రేపింది. ఇవాళ తెల్లవారుజామున దుండగులు ఏటీఎంను ధ్వంసం చేసి ఎత్తుకెళ్లారు. ఘటన జరిగిన కొద్ది గంటల్లోనే ఏటీఎం సామగ్రిని శింగనమల మండలం ఆకులేడు శివారులో గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం.. తాడిపత్రి ప్రధాన రహదారిపై ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎం గది అద్దాలను పగులగొట్టి, యంత్రంతో పాటు అందులో ఉన్న బ్యాటరీలను అపహరించారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం కావడం, ఏటీఎం నుంచి సుమారు వంద మీటర్ల దూరంలోనే పోలీస్ స్టేషన్ ఉన్నప్పటికీ ఈ ఘటన జరగడం స్థానికంగా సంచలనంగా మారింది. సమాచారం తెలుసుకున్న వెంటనే డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ సుబ్బరాయుడు, ఎస్సై రాంప్రసాద్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్ సాయంతో తనిఖీలు చేపట్టి, పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నారు. దుండగులు ఎత్తుకెళ్లిన ఏటీఎంకు సంబంధించిన సామగ్రిని శింగనమల మండలం ఆకులేడు గ్రామ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తులు పడేసి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. అక్కడ కూడా ఆధారాల కోసం పరిశీలిస్తున్నారు. చోరీకి పాల్పడిన నిందితులను గుర్తించి పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. ఈ ఘటనపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

### ప్రొద్దుటూరులో రూ.23 లక్షల

## నగదు చోరీ కేసు ఛేదించిన పోలీసులు

**ప్రొద్దుటూరు విశ్వం వాయిస్ న్యూస్ :** బంగారం కొనుగోలు కోసం ఇంట్లో భద్రపరిచిన నగదుపై కన్నేసిన గుమాస్తా... యజమాని ఇంట్లో పనిచేస్తూనే చోరీకి పథకం రచించిన నిందితుడు... స్నేహితుడితో కలిసి రూ.23 లక్షల నగదు అపహరణ... ఫిర్యాదుదారు బయటకు వెళ్లిన సమయంలో చోరీకి పాల్పడిన దుండగులు... విశ్వసనీయ సమాచారంతో నిందితులను అరెస్టు చేసిన పోలీసులు.. ప్రొద్దుటూరు త్రీ టౌన్ పోలీసుల చాకచక్యంతో కేసు ఛేదన... నిందితుల వద్ద నుంచి రూ.22.91 లక్షల నగదు స్వాధీనం... పంచాయతీదారుల సమక్షంలో నగదు, ఇతర సొత్తు స్వాధీనం... చోరీకి గురైన మొత్తం నగదులో అత్యధిక భాగం రికవరీ.. ఇన్స్పెక్టర్ డి.రామాంజనేయులు ఆధ్వర్యంలో ప్రత్యేక ఆపరేషన్... నిందితులపై చట్టపరమైన చర్యలు కొనసాగుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో దారుణం

### వైద్యులు లేకపోవడంతో కాన్పు చేసిన నర్సు.. తల్లి, బిడ్డ మృతి




**భద్రాది, విశ్వం వాయిస్ న్యూస్ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం శంభూనిగూడెం గ్రామంలో వనజ(20) అనే మహిళకు పురిటి నొప్పులు రావడంతో గుండాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన కుటుంబ సభ్యులు. ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో సాధారణ కాన్పు చేసిన నర్సు. కాన్పు తర్వాత శిశువు అపస్మారక స్థితిలోకి వెళ్లడం గమనించి ఇల్లెందు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మరణించిందని తెలిపిన వైద్యులు. కాన్పు అనంతరం తల్లికి తీవ్ర రక్తస్రావం కావడంతో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం తమ కుటుంబంలో తీరని శోకాన్ని నింపిందని కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## నలుగురు అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్



**కంచికచర్ల, విశ్వం వాయిస్ న్యూస్ :** నందిగామ నియోజకవర్గంలోని కంచికచర్లలో జరిగిన భారీ బంగారు ఆభరణాల దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. ఈ నెల 4వ తారీఖున జరిగిన ఈ దోపిడీలో 374 గ్రాముల బంగారం, రూ.50 వేల నగదు చోరీకి గురయ్యాయి. సాంకేతిక ఆధారాల సాయంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. నలుగురు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.52 లక్షల విలువైన బంగారాన్ని స్వాధీనం చేసుకొని రిమాండుకు తరలించినట్లు ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ వైవివియల్ నాయుడు, ఎస్ఐ విశ్వనాథ్, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో చోరీ



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా సామర్లకోట రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో ఒక బైక్, ఒక స్కూటర్ చోరీయత్నం మంగళవారం రాత్రి జరిగింది. స్థానికులు అప్రమత్తమై బైక్ చోరీకి ప్రయత్నించిన దొంగలను పట్టుకునేందుకు ప్రయత్నించారు. చోరీకి ప్రయత్నించిన ముగ్గురు దొంగల్లో ఇద్దరు పారిపోగా, ఒక దొంగ పట్టుపడ్డాడు. ఆపట్టుపడ్డ దొంగను స్థానికులు వివరాలు అడుగగా ఏటిమొగ్గ అని తెలిపాడు.. ఆ దొంగను పోలీసులకు అప్పగించినట్లు స్థానికులు తెలిపారు.

## మాజీ సైనికుడికి జరిగిన అవమానంపై ఆగ్రహం

### ఎక్సైజ్ కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



**గుంటూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** గుంటూరులో మాజీ సైనికుడు కృపారావుపై ఎక్సైజ్ సిబ్బంది అనుచితంగావ్యవహరించారని ఆరోపిస్తూ మాజీ సైనికులు బుధవారం ఎక్సైజ్ శాఖ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈసందర్భంగా బుధవారం ఎక్స్ఛేంజ్ ఆఫీస్ ఎదురు ఙూఖ ప్రసాద్ వెంకట్ అప్పారావు మాట్లాడ్తూ చట్టబద్ధంగా కొనుగోలు చేసిన మద్యం సీసాలు, బిల్లులు, గుర్తింపు కార్డులు ఉన్నప్పటికీ ఆయనను స్టేషన్‌కు తీసుకెళ్లి కేసు నమోదు చేశారని వారు ఆరోపించారు. ఈ ఘటనపై మాజీ సైనిక సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ బాధ్యులైన ఎక్సైజ్ కానిస్టేబుళ్లపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ సైనికులకు తగిన గౌరవం ఇవ్వకుండా అవమానకరంగా వ్యవహరించడం దేశానికే సిగ్గు చేటు అని పేర్కొన్నారు. ఫిర్యాదుపై జిల్లా కలెక్టర్ స్పందించి విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. విచారణలో నిజాలు వెలుగులోకి వచ్చి బాధితుడికి న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని మాజీ సైనికులు ఙూఖ ప్రసాద్ వెంకట్ అప్పారావు కోరారు. మాజీ ఆర్మీ సిబ్బంది డీఎస్‌కే ప్రసాద్, 1971 ఇండో-పాక్ యుద్ధ వీరుడు వెంకటప్పారావు మాట్లాడుతూ, దేశ సరిహద్దుల్లో సేవలందించిన మాజీ సైనికులకు గౌరవం ఇవ్వాల్సిందిపోయి అవమానించడం బాధాకరమన్నారు.

## ఇంటర్ తర్వాత విద్యార్థులు చేయడానికి అవకాశం ఉన్న ఉన్నతమైన 113 కోర్సులు ఇవే...

## మీ వారికి.. మీ బంధు మిత్రులకు పనికొచ్చే అవకాశం లేకపోలేదు..


001. ఏరోనాటికల్ ఇంజనీరింగ్
002. ఏరోస్పేస్ ఇంజనీరింగ్
003. ఆర్కిటెక్చర్ ఇంజనీరింగ్
004. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్
005. ఆస్ట్రోనమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్
006. ఆటోమొబైల్ ఇంజనీరింగ్
007. బయో మెడికల్ ఇంజనీరింగ్
008. బయో టెక్నాలజీ ఇంజనీరింగ్
009. సెరామిక్స్ ఇంజనీరింగ్
010. కెమికల్ ఇంజనీరింగ్
011. సివిల్ ఇంజనీరింగ్
012. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్
013. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్
014. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్
015. ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్
016. ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్
017. ఇంస్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్
018. మ్యాన్యుఫ్యాక్చరింగ్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్
019. మెరైన్ ఇంజనీరింగ్
020. మెకానికల్ ఇంజనీరింగ్
021. మెడికల్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్
022. మెటాలర్జీ
023. మెటరాలజీ
024. మైనింగ్ ఇంజనీరింగ్
025. నావల్ ఆర్కిటెక్చర్ ఇంజనీరింగ్
026. ఫిజికల్ సైన్సెస్
027. పాలీమర్ ఇంజనీరింగ్
028. రోబోటిక్స్
029. టెక్స్‌టైల్ ఇంజనీరింగ్
030. అగ్రికల్చర్ సైన్స్
031. బయోలాజికల్ సైన్స్
032. బయోటెక్నాలజీ
033. కంప్యూటర్ అప్లికేషన్స్
034. కంప్యూటర్ సైన్స్
035. సైబర్ సెక్యూరిటీ
036. ఎర్త్ సైన్స్ / జాగ్రఫీ
037. ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్
038. ఫిషరీస్
039. ఫ్లోరికల్చర్/హార్టికల్చర్
040. ఫుడ్ టెక్నాలజీ
041. ఫారెస్ట్రీ
042. ఓషియనోగ్రఫీ
043. స్టాటిస్టికల్ సైన్స్
044. వెటర్నరీ సైన్సెస్
045. వైల్డ్ లైఫ్ బయాలజీ
046. జువాలజీ
047. ఆయుర్వేద బీఏఎంఎస్
048. డెంటల్ బీడీఎస్
049. హోమియోపతి
050. న్యాచురోపతి
051. ఫార్మసీ
052. సిద్ధ
053. యునానీ
054. ఆంత్రోపాలజీ
055. ఆర్కియాలజీ
056. ఆర్ట్ రిస్టోరేషన్
057. క్యూరేషన్
058. ఎడ్యుకేషనల్/వొకేషనల్ స్కూల్ కౌన్సిలర్
059. మాన్యుమెంట్స్ అండ్ స్కల్ప్చర్ రిస్టోరేషన్
060. మ్యూసియాలజీ
061. ఫిజియోథెరపీ
062. రిహ్యాబిలిటేషన్ సైకాలజీ
063. రిహ్యాబిలిటేషన్ థెరపీ
064. సోషల్ వర్క్
065. స్పెషల్ ఎడ్యుకేటర్
066. స్పీచ్ లాంగ్వేజ్ అండ్ హియరింగ్
067. లా
068. అడ్వర్టైజింగ్
069. జర్నలిజం
070. మాస్ కమ్యూనికేషన్
071. పబ్లిక్ రిలేషన్స్
072. ఆర్ట్ డైరెక్షన్
073. కొరియోగ్రఫీ
074. డైరెక్షన్
075. ఫిల్మ్/డ్రామా ప్రొడక్షన్
076. ఫైన్ ఆర్ట్స్
077. పర్ఫామింగ్ ఆర్ట్స్
078. వోకల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్
079. యానిమేషన్
080. సినిమాటోగ్రఫీ
081. కమ్యూనికేషన్ డిజైన్
082. డిజైన్
083. గ్రాఫిక్ డిజైనింగ్
084. ఫోటోగ్రఫీ
85. యాక్చురియల్ సైన్సెస్
086. బ్యాంక్ మేనేజ్‌మెంట్
087. బిజినెస్ అడ్మినిస్ట్రేషన్
088. బిజినెస్ మేనేజ్‌మెంట్
089. కాస్ట్స్ అండ్ వర్క్స్ అకౌంట్స్
090. చార్టర్డ్ అకౌంటెన్సీ
091. చార్టర్డ్ ఫైనాన్షియల్ అనాలిసిస్
092. ఈవెంట్ మేనేజ్‌మెంట్
093. హాస్పిటల్ మేనేజ్‌మెంట్
094. హోటల్ మేనేజ్‌మెంట్
095. హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్
096. ఇన్స్యూరెన్స్
097. లాజిస్టిక్స్ అండ్ సప్లై చెయిన్ మేనేజ్‌మెంట్
098. మేనేజ్‌మెంట్
099. బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్
100. డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్
101. కార్పొరేట్ ఇంటెలిజెన్స్
102. డిటెక్టివ్
103. ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రీషియన్
104. ఫారిన్ లాంగ్వేజెస్
105. హోమ్ సైన్స్
106. ఇంటీరియర్ డిజైనింగ్
107. లిబరల్ స్టడీస్
108. లైబ్రరీ సైన్సెస్
109. మాంటెస్సరీ టీచింగ్
110. న్యూట్రీషియన్ అండ్ డైటెటిక్స్
111. ఫిజికల్ ఎడ్యుకేషన్
112. స్పోర్ట్స్ అండ్ స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్
113. టూరిజం అండ్ ట్రావెల్.

విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కోసం రూపొందించిన బుక్ లెట్‌లో సీ.బీ.ఎస్.ఈ(జదీూజు) ప్రధానంగా వివరించిన 113 కోర్సులు ఇవి.

ఇవే కాకుండా అనేక రంగాల్లో అనేక కోర్సులు ఉన్నాయి.

అయితే విద్యార్థుల అభిరుచికి తగ్గట్టుగా కోర్సులు ఎంచుకుంటే కెరీర్ బాగుంటుంది.

# విశ్వం వాయిస్
అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ


గురువారం, 18 జూన్, 2026


www.viswamvoice.com

## 26న కిడ్నీ వ్యాధులపై అవగాహన సదస్సు

**సాగర్ కిడ్నీ కేర్ ఆసుపత్రి దశమ వార్షికోత్సవ వేడుకలు - ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి**
**సీనియర్ వైద్యులకు సత్కారం - ఆసుపత్రి అధినేత డాక్టర్ శశాంక్ వెల్లడి**






**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సాగర్ కిడ్నీ కేర్ ఆసుపత్రి దశమ వార్షిక వేడుకలను పురస్కరించుకుని ఈనెల 26వ తేదీ శుక్రవారం స్థానిక జె.ఎన్. రోడ్డులోని చెరుకూరి కల్యాణ మండపంలో మూత్రపిండాల వ్యాధులపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి అధినేత, నెఫ్రాలజిస్ట్ డాక్టర్ పి.శశాంక్ చెప్పారు. స్థానిక దానవాయిపేటలోని సాగర్ కిడ్నీ కేర్‌లో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సదస్సు 8గంటలకు ప్రారంభమై, 12గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. కోస్తా ఆంధ్రా ప్రాంతంలోనే తొలిసారిగా అత్యంత స్వచ్ఛమైన డయాలసిస్ నీటిని వినియోగిస్తూ తమ ఆసుపత్రి సేవలందిస్తోందని డాక్టర్ శశాంక్ చెప్పారు. తమ హాస్పిటల్ లో అల్ట్రా ప్యూర్ డయాలసిస్ వాటర్, ప్రెసెనియస్ 50085 హిమోడియాఫైల్ట్రేషన్ అండ్ కార్డియక్స్ డయలైజర్ టెక్నాలజీ, ఐపిజి 35కెవి లేజర్ మెషిన్‌తో అత్యాధునిక చికిత్స, గుండె సంబంధిత, దీర్ఘకాలిక డయాలసిస్ రోగులకు ఆధునిక చికిత్స ప్రత్యేకతలుగా ఆయన వివరించారు.గుండె, మెదడు స్ట్రోక్ లకు సంబంధించి ప్రజల్లో అవగాహన ఉందని, అయితే కిడ్నీ వ్యాధులపై అవగాహన తక్కువగా ఉండడం వలన వ్యాధి ముదిరిపోయాక హాస్పిటల్‌కి రావడం చూస్తున్నామని డాక్టర్ శశాంక్ చెప్పారు. కాళ్ళ వాపు, వాంతులు ఎక్కువ కావడం వంటి పరిస్థితుల్లో వస్తున్నారని ఆయన తెలిపారు. డాక్టర్ చిటీలను బట్టి మందులు కొనుకోవడం వలన ఇబ్బందులు ఉండవని, లేకుంటే సమస్యలు ఉత్పన్నం అవుతాయని ఆయన అన్నారు. వీటన్నింటిపై అవగాహన కల్పించడానికి ఈ సదస్సు దోహద పడుతుందని ఆయన చెప్పారు. రాజమండ్రి రూరల్ శాసనసభ్యుడు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు గోరంట్ల బుచ్చయ్య చౌదరి ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారని ఆయన తెలిపారు. దశమ వార్షిక వేడుకల సందర్భంగా వైద్య రంగంలో ఇరవై నుంచి నలభై ఏళ్లకు పైగా విశేష అనుభవం గడించిన సీనియర్ వైద్య నిపుణులను ఘనంగా సత్కరించనున్నట్లు డాక్టర్ శశాంక్ చెప్పారు. స్విమ్స్ పూర్వ డైరెక్టర్ వి.శివకుమార్(తిరుపతి), నెఫ్రాలజిస్టులు డాక్టర్ జి. ప్రసాద్ (విశాఖ), డాక్టర్ కె ప్రవీణ్ కుమార్ (నెల్లూరు), డాక్టర్ రాజశేఖర చక్రవర్తి (హైదరాబాద్), డాక్టర్ ఏకె చక్రవర్తి (నెల్లూరు), గుంటూరు అశ్విని హాస్పిటల్ కి చెందిన డాక్టర్ ఏ శ్రీనివాస్, రాజమండ్రి నేమాని కిడ్నీ సెంటర్ డాక్టర్ నేమాని సత్యనారాయణ, కాకినాడకు చెందిన నెఫ్రాలజిస్ట్ డాక్టర్ డివిఎస్ సోమయాజులు, హైదరాబాద్ కి చెందిన న్యూరాలజిస్ట్ డాక్టర్ జివి సుబ్బయ్య చౌదరి, కార్డియాలజిస్ట్ డాక్టర్ రమేష్ గూడపాటి,యూరాలజిస్ట్ డాక్టర్ సూర్యప్రకాష్, విశాఖకు చెందిన డాక్టర్ ఎం సాయి రవిశంకర్, డాక్టర్ కె కల్యాణ చక్రవర్తి లను సత్కరించనున్నట్లు డాక్టర్ శశాంక్ తెలిపారు.పదేళ్ల పాటు వైద్య రంగంలో సేవలందిస్తూ మైలు రాయికి చేరడం ఆనందంగా ఉందని డాక్టర్ శశాంక్ పేర్కొంటూ, తమ సంస్థకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ఈసందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

## 12 ఏళ్ల మోదీ పాలన దేశానికి గర్వకారణం

**కూటమి బలంతో సీఎం చంద్రబాబు రాష్ట్ర పునర్నిర్మాణానికి శ్రీకారం - జాతీయ భద్రతకు ఇచ్చిన ప్రాధాన్యత దేశ ప్రతిష్టను పెంచాయి**
**రహదారులు, రైల్వేలు, విమానాశ్రయాలు, పోర్టులు, డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధి**
**12 ఏళ్ల విశ్వాస్ కే, వికాస్ కే, జన్ కళ్యాణ్ కే" కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు**





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత 12 సంవత్సరాలుగా దేశాన్ని అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన రంగాల్లో ప్రపంచానికి ఆదర్శంగా నిలిపిందని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా "12 ఏళ్ల విశ్వాస్ కే, వికాస్ కే, జన్ కళ్యాణ్ కే" పేరిట ఈ రోజు ఉదయం స్థానిక ఆనం కళా కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, రాజమహేంద్రవరం నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు , అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తదితరుల కూటమి నాయకులతో కలిసి రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం అంతర్జాతీయ వేదికలపై అపూర్వమైన గుర్తింపు సాధించిందని అన్నారు. ప్రపంచ దేశాలు భారతదేశాన్ని గౌరవంతో చూసే స్థాయికి తీసుకెళ్లిన ఘనత మోదీదేనని పేర్కొన్నారు. జీ-20 సదస్సు విజయవంతమైన నిర్వహణ, విదేశాంగ విధానంలో సాధించిన విజయాలు, జాతీయ భద్రతకు ఇచ్చిన ప్రాధాన్యత దేశ ప్రతిష్టను మరింత పెంచాయని తెలిపారు. గత 12 సంవత్సరాల్లో దేశంలో రహదారులు, రైల్వేలు, విమానాశ్రయాలు, పోర్టులు, డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధి అపూర్వంగా జరిగిందని చెప్పారు. డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియా వంటి కార్యక్రమాల ద్వారా యువతకు విస్తృత అవకాశాలు లభించాయని, యూపీఐ లావాదేవీల ద్వారా భారతదేశం ప్రపంచానికి డిజిటల్ విప్లవానికి మార్గదర్శకంగా నిలిచిందని వివరించారు. ఆయుష్మాన్ భారత్, ప్రధాని ఆవాస్ యోజన, ముద్ర యోజన, పీఎం కిసాన్ వంటి సంక్షేమ కార్యక్రమాల ద్వారా కోట్లాది కుటుంబాలకు ప్రత్యక్ష లబ్ధి చేకూరిందని తెలిపారు. సంక్షేమం మరియు అభివృద్ధి రెండింటినీ సమన్వయం చేస్తూ కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి నాయకత్వంలో రాష్ట్రం తిరిగి అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. గతంలో నిలిచిపోయిన అభివృద్ధి కార్యక్రమాలు తిరిగి ప్రారంభమయ్యాయని, పెట్టుబడుల ఆకర్షణ, పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి కల్పన, మౌలిక వసతుల విస్తరణ, పుష్కరాల ఏర్పాట్లు వంటి అంశాల్లో ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేస్తోందన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారని, కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు సమన్వయంతో ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధి దిశగా దూసుకుపోతోందని తెలిపారు. దేశంలో మోదీ నాయకత్వం, రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయకత్వం ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుని అభివృద్ధి, సంక్షేమానికి కొత్త ప్రమాణాలను సృష్టిస్తున్నాయని వారు పేర్కొన్నారు.

## అనారోగ్య బాలికకు అండగా మంత్రి సుభాష్

**చైత్ర హాసిని వైద్య చికిత్స కోసం రూ.20 వేల ఆర్థిక సహాయం**



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** మానవతా దృక్పథంతో ప్రజలకు అండగా నిలుస్తున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మరోసారి తన సేవాభావాన్ని చాటుకున్నారు. వెన్నుపూస సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఓ బాలికకు రూ.20 వేల ఆర్థిక సహాయం అందించి కుటుంబానికి భరోసా కల్పించారు. రామచంద్రపురం రూరల్ మండలం పెద్దతాళ్లపొలం గ్రామానికి చెందిన దొమ్మేటి శ్రీనివాస్, గీతాంజలి దంపతుల కుమార్తె చైత్ర హాసిని కొంతకాలంగా వెన్నుపూస సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. ఈ విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న మంత్రి సుభాష్ వెంటనే స్పందించి బాలిక వైద్య చికిత్స నిమిత్తం రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ చిన్నారి చైత్ర హాసిని మెరుగైన వైద్య సేవలు పొందాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచిస్తూ అవసరమైతే భవిష్యత్తులో కూడా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం కావడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని పేర్కొన్నారు. అనారోగ్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమ కుటుంబానికి అండగా నిలిచి మానవతా దృక్పథంతో సహాయం చేసిన మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు చైత్ర హాసిని కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి చేసిన ఆర్థిక సాయం తమకు ఎంతో ఊరటనిచ్చిందని పేర్కొన్నారు.

**గొలుసు దొంగతనం కేసులో**

## నిందితుడికి జైలు శిక్ష



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాయవరం పోలీస్ స్టేషన్‌లో గత ఏడాది నమోదైన చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడికి కోర్టు జైలు శిక్షతో పాటు జరిమానా విధించినట్లు రాయవరం ఎస్సై సురేష్ బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, 2025 సంవత్సరంలో వెంటూరు గ్రామానికి చెందిన మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసును బలవంతంగా లాక్కెళ్లిన ఘటనపై బాధితురాలు ఫిర్యాదు చేయడంతో దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, విచారణలో సాధనాల వెంకటేష్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి చోరీకి గురైన బంగారు గొలుసును స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచగా, కేసు విచారణ అనంతరం అనపర్తి ప్రథమ శ్రేణి న్యాయ మేజిస్ట్రేట్ నిందితుడు సాధనాల వెంకటేష్‌కు ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.50 జరిమానా విధించారని ఎస్సై సురేష్ బాబు తెలిపారు.

**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఏపీఎస్ఆర్టీసీ**

## నూతన డి.పి.టి.ఓగా డి.సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ


**శుభాకాంక్షలు తెలిపిన రామచంద్రపురం డిపో మేనేజర్ భాస్కరరావు**



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఏపీఎస్ఆర్టీసీ డివిజనల్ పర్సనల్ అండ్ ట్రాఫిక్ ఆఫీసర్ (డి.పి.టి.ఓ)గా డి. సత్యనారాయణ నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రామచంద్రపురం ఆర్టీసీ డిపో మేనేజర్ పేపకాయల భాస్కరరావు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. నూతన బాధ్యతల్లో సత్యనారాయణ సమర్థవంతంగా పనిచేస్తూ జిల్లాలో ఆర్టీసీ సేవల విస్తరణకు, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో తనదైన ముద్ర వేయాలని ఆకాంక్షించారు. ఈ నియామకంపై రామచంద్రపురం డిపో సిబ్బంది, అధికారులు హర్షం వ్యక్తం చేస్తూ సత్యనారాయణ నాయకత్వంలో సంస్థ మరిన్ని విజయాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణకు సహోద్యోగులు, వివిధ విభాగాల అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతల స్వీకరణ అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ సంస్థ అభివృద్ధికి, సిబ్బంది సంక్షేమానికి, ప్రయాణికుల రవాణా సౌకర్యాలను మరింత మెరుగుపరిచేందుకు కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీకి చెందిన పలువురు అధికారులు, సిబ్బంది, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.









# ఘనంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ జన్మదిన వేడుకలు

**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ జన్మదిన వేడుకలు రామచంద్రపురంలో అత్యంత ఘనంగా, వినూత్న రీతిలో జరిగాయి. "ఊపిరి ఉన్నంతవరకు ప్రజా సేవలోనే ఉంటా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తా" అని ఈ సందర్భంగా మంత్రి ఉద్ఘాటించారు. ఆడంబరాలకు, హంగు ఆర్భాటాలకు తావులేకుండా, సామాన్య ప్రజలకు మేలు చేసే పలు సేవా కార్యక్రమాలతో ఆయన తన పుట్టినరోజును జరుపుకోవడం విశేషంగా నిలిచింది. నియోజకవర్గంలోని నలుమూలల నుంచి వేలాది మంది అభిమానులు, కార్యకర్తలు, అధికారులు మరియు కూటమి నాయకులు తరలివచ్చి మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అభిమానుల కోరిక మేరకు భారీ కేక్ కట్ చేసిన మంత్రి, వారితో ఆనందాన్ని పంచుకున్నారు. మంత్రి జన్మదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలో రక్తదాన, కంటి, దంత వైద్య శిబిరాలతో

### ఆడంబరాలకు దూరంగా ప్రజా సేవలో నిమగ్నం



పాటు జనరల్ మెడిసిన్ మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేశారు. అలాగే వృద్ధులకు చీరలు, వస్త్రాలను పంపిణీ చేశారు. ముఖ్యంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న అచంట నియోజకవర్గం పెనుగొండ మండలం పితానివారి పాలెంకు చెందిన అన్నా చెల్లెలు కుప్పల నాగ శేఖర్, ఒత్తుల భవానిలకు రూ.1.50 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించారు. వీరికి ముఖ్యమంత్రి జీవనధార కార్యక్రమం ద్వారా కిడ్నీ మార్పిడికి కూడా పూర్తి సహకారం అందిస్తామని మంత్రి భరోసానిచ్చారు. మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ 'మహిళా అడ్డా' కార్యక్రమం ద్వారా 100 మంది మహిళలకు చిరు వ్యాపార అవకాశాలను కల్పించారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్, సహారా సంస్థల సహకారంతో రూ.20 లక్షల వ్యయంతో స్థానిక వి.ఎస్.ఎం కళాశాల సమీపంలో 'సూపర్ మిల్లెట్ కేఫ్'ను ప్రారంభించి మహిళలకు అప్పగించారు. గ్రామీణ మహిళలకు ఉపాధి కల్పన లక్ష్యంగా ఈ కేఫ్‌తో పాటు త్వరలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. అలాగే స్పైసెస్ కంపెనీ భాగస్వామ్యంతో రూ.2 కోట్ల పెట్టుబడితో మరో పరిశ్రమను ఏర్పాటు చేసి మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పిస్తామని మంత్రి వెల్లడించారు. విద్యార్థుల కోసం వసుధ ఫార్మసీ సీఎస్ఆర్ నిధుల ద్వారా 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. పట్టణంలో స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు 50 వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేయడంతో పాటు, కళాశాల విద్యార్థులు బస్టాండ్‌కు సురక్షితంగా చేరుకునేందుకు మూడు ఆటోలను కూడా అందుబాటులోకి తెచ్చారు. ఈ కార్యక్రమంలో వాసంశెట్టి సత్యం, గుత్తుల సాయి, కుడిపూడి సత్తిబాబు, అక్కల రిశ్వంత్ రాయ్, పోలిశెట్టి చంద్రశేఖర్, పిల్లి అనంత లక్ష్మీ సత్యనారాయణ దంపతులు, మజ్జి పద్మావతి, పప్పుల మసేను వెంకన్న తదితరులు పాల్గొన్నారు. మంత్రి చేపట్టిన సేవా కార్యక్రమాలపై స్థానిక మహిళలు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

### అమర్నాథ్ గౌడ్ కుటుంబానికి

# పూర్తి న్యాయం జరిగే వరకు అండగా ఉంటాం

### మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులు : ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన రాజకీయ అరాచకాలు, ఉన్మాద చర్యలకు బలైన అమాయక బాలుడు అమర్నాథ్ గౌడ్ కుటుంబానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు తెలిపారు. అమలాపురం పట్టణంలో మంగళవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు, కూటమి నాయకులతో కలిసి సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ అరాచకాలకు వ్యతిరేకంగా, అమర్నాథ్ గౌడ్‌కు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ చేతుల్లో కొవ్వొత్తులు పట్టుకుని భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. తన సోదరిని వేధింపుల నుంచి రక్షించేందుకు ప్రయత్నించిన చిన్నారి అమర్నాథ్ గౌడ్‌ను వైఎస్సార్‌సీపీకి చెందిన అసాంఘిక శక్తులు అత్యంత అమానుషంగా దహనం చేసిన ఘటనను ఈ సందర్భంగా ఆనందరావు గుర్తు చేసుకుంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా బాధితులకు త్వరితగతిన పూర్తి న్యాయం చేయడమే తమ ప్రధాన లక్ష్యమని పునరుద్ఘాటించారు. గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, అధికార పార్టీ అండతో కొందరు ఉన్మాదుల్లా ప్రవర్తించారని విమర్శించారు. అమర్నాథ్ గౌడ్ వంటి ఎంతోమంది అమాయక దళిత, వెనుకబడిన వర్గాల పిల్లలు అప్పటి అరాచక పాలనకు బలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన ప్రతిపక్ష నాయకులను అడ్డుకున్న అప్పటి పాలకులు, నిందితులను వెనకేసుకురావడానికే ప్రాధాన్యత ఇచ్చారని ఆరోపించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఇలాంటి ఫ్యాక్షన్, ఉన్మాద రాజకీయాలకు స్వస్తి పలికిందని తెలిపారు. చట్టాన్ని అతిక్రమించే వారు ఏ పార్టీకి చెందిన వారైనా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. మహిళలు, చిన్నారుల రక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అమర్నాథ్ గౌడ్ కేసులో నిందితులకు చట్టప్రకారం కఠిన శిక్షలు పడేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని చెప్పారు. బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం జరిగే వరకు కూటమి శ్రేణులు పోరాటం కొనసాగిస్తాయని, అమలాపురం నియోజకవర్గంలో అసాంఘిక శక్తులను ఏమాత్రం సహించబోమని హెచ్చరించారు. ఈ కొవ్వొత్తుల నిరసన కార్యక్రమంలో కూటమి పార్టీల ముఖ్య నాయకులు, వివిధ సామాజిక వర్గాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### కొత్తపేట యస్ఏఎఫ్ ఆధ్వర్యంలో

## ఘనంగా మంత్రి సుభాష్ జన్మదిన వేడుకలు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేట నియోజకవర్గ ఎస్ఏఎఫ్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక శాఖామాత్యులు, ఎస్ఏఎఫ్ వ్యవస్థాపకులు వాసంశెట్టి సుభాష్ జన్మదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వానపల్లి శ్రీశ్రీ పళ్ళాలమ్మ అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆయురారోగ్యాలు, ప్రజాసేవలో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని పూజలు చేపట్టారు. అనంతరం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్, పండ్లు, మజ్జిగ అందించారు. అనంతరం రావులపాలెంలోని శుభోదయ అంధుల పాఠశాలలో కేక్ కట్ చేసి విద్యార్థులతో కలిసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. అనంతరం విద్యార్థులకు భోజనాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ ఏ ఎఫ్ నాయకులు మాట్లాడుతూ, సమాజ సేవే లక్ష్యంగా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్న మంత్రి వాసంశెట్టి సుభాష్ జన్మదినాన్ని సేవా దినోత్సవంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బొక్కా ప్రసాద్,ముషిని వెంకట రమణ,కడలి బీమా,కడలి పార్థసారథి, కముజు వరప్రసాద్,దంగేటి సాయి, జోగి గని రాజు,కముజు శ్రీనివాస్, వనుము వెంకటేష్, దంగేటి ఆదినారాయణ, బొక్కా సాయి, దాసరి ప్రసాద్, అంబటి సాగర్, కోట లక్ష్మణ్, కోట శ్రీహరి, కొమ్మన స్వామి నాయుడు, యనమదల రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

### చప్పిడివారిపాలెం హైస్కూల్‌లో

## ప్రతిభావంతులైన విద్యార్థులను అభినందించిన గ్రామస్తులు





**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** యస్ఆర్యన్వియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చప్పిడివారిపాలెం నందు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.అరుణశ్రీ అధ్యక్షతన జరిగిన అభినందన సభలో ప్రతిభ కనబరచిన విద్యార్థులను గ్రామ పెద్దలు, పాఠశాల కమిటీ చైర్మన్, మండల విద్యా శాఖ అధికారి దుస్సాలువతో సత్కరించారు.పదవ తరగతి విభాగంలో చెముడు ప్రవల్లిక 574 మార్కులు, చప్పిడి హాసిని కోటేశ్వరి 552, యర్రంశెట్టి జ్యోతిర్మయి 548 మార్కులు మరియు హై స్కూల్ ప్లస్ ఇంటర్ విద్యార్థినులు అయిన దాసరి మోక్షశ్రీ నాగ భవాని, కాళ్ళకూరి వైష్ణవి, యన్ యం యం యస్ కు ఎంపికైన కట్టా షణ్ముఖ ధర్మసాయి ని దుస్సాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పిసి చైర్మన్ పితాని బాల వెంకటరమణ, గ్రామ పెద్దలు రెడ్డి చంటి రెడ్డి రామకృష్ణ, యంపిటిసి దూళి సూరిబాబు, రెడ్డి తాతాజీ, సూరవరపు రామకృష్ణ (పిఏసిఎస్), చైర్మన్, చిల్లే ప్రసాద్, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయ, ఉపాధ్యాయనిలు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి ఎం.హరిప్రసాద్ మాట్లాడుతూప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు గట్టి పోటీ ఇస్తున్నాయని, ఏ మాత్రం తక్కువ కాదని విద్యార్థుల తల్లిదండ్రులు గమనించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కె.అరుణశ్రీ, ప్రధానోపాధ్యాయురాలు, సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

### రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు

## ఎంపికైన జిల్లా విద్యార్థులు

### ప్రతిభ చాటాలని ఏఎంఓ రాంబాబు ఆకాంక్ష



**కే.గంగవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు యోగాంధ్ర రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కె.గంగవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం జీవీఎస్ సుబ్రహ్మణ్యం, మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ జె.సురేష్‌కుమార్‌ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను సమగ్ర శిక్షా అకడమిక్ మానిటరింగ్ అధికారి (ఏఎంఓ) పి.రాంబాబు అభినందించారు. ఈ సందర్భంగా ఏఎంఓ రాంబాబు మాట్లాడుతూ యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని ఇది ఆరోగ్యానికి చక్కటి మార్గమని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి జిల్లాకు మరింత గుర్తింపు తీసుకురావాలని విద్యార్థులను ఆకాంక్షించారు. విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి, వారికి తర్ఫీదునిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు జె.సురేష్‌కుమార్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర స్థాయి యోగాంధ్ర పోటీలకు ఎంపికైన విద్యార్థుల వివరాలను మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ సురేష్‌కుమార్ వెల్లడించారు. సోలో యోగా విభాగంలో అద్దంపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి వైవీఎస్ ప్రణీల్, శివల జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి మేడిశెట్టి గోపికశ్రీ ఎంపికయ్యారు. సింకరనైజ్డ్ యోగా విభాగంలో శివల జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు పువ్వల నిత్యశ్రీ, కట్టా వైష్ణవి, వంగలపూడి లహరి, కట్టా వంశీ, కటకం సన్నీ, కటకం హెబ్రీ ఎంపిక కాగా, వ్యాసరచన పోటీలకు సుందరపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి గొల్లపల్లి క్రాంతి ఎంపికయ్యారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి చేరుకున్న విద్యార్థులకు, పాఠశాల హెచ్ఎం జీవీఎస్ సుబ్రహ్మణ్యం పెన్నులను బహూకరించి అభినందనలు తెలిపారు.

### నియోజకవర్గంలో రూ.3 కోట్లతో

## డ్రైన్ల ఆధునికీకరణ : ఎమ్మెల్యే బండారు



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేట నియోజకవర్గంలో నీటి పారుదల వ్యవస్థ అభివృద్ధి, చెరువుల ఆధునికీకరణకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం సీఆర్సీ రోడ్డులో రూ.7 లక్షల వ్యయంతో చేపట్టిన లొల్ల హైవే ఛానల్ పూడికతీత పనులను ఆయన కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలువల్లో పూడికతీత పనులు చేపట్టడం ద్వారా చివరి ఎకరా వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జల వనరులను కలుషితం చేయకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చేపట్టిన పనులను నాణ్యతతో, సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఈతకోట గ్రామంలో సహస్ర ప్రాపర్టీస్ ఆధ్వర్యంలో రూ.30 లక్షల వ్యయంతో చేపట్టనున్న చెరువు ఆధునికీకరణ, సుందరీకరణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. చెరువు పరిసరాలను అభివృద్ధి చేసి పార్కును సుందరీకరించడం ద్వారా ప్రజలకు మెరుగైన వాతావరణాన్ని కల్పించనున్నట్లు తెలిపారు. కొత్తపేట నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు రూ.3 కోట్ల వ్యయంతో డ్రైన్ల ఆధునికీకరణ పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వెల్లడించారు. వ్యవసాయం, నీటి పారుదల, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ పుట్టినరోజు వేడుక



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పుట్టినరోజు వేడుకలను ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. రావులపాలెం మండలం ఊబలంక గ్రామంలోని మదర్ తెరిసా ఆశ్రమంలో దివ్యాంగులకు భోజనాలు పళ్ళు పంచిపెట్టారు. ఆలమూరు ఏఎస్ఐ డి.స్వామి, విక్టరి రెస్టారెంట్ మేనేజింగ్ పార్ట్నర్ బోయిడి వెంకన్న బాబు ( బద్రి ) ఆధ్వర్యంలో మంత్రి పుట్టిన రోజు వేడుకలు జరిగాయి. కేక్ కట్ చేసి మంత్రి సుభాష్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మదర్ తెరిసా ఆశ్రమ ఫౌండర్ దిద్ల కిషోర్ మాట్లాడుతూ మంత్రి సుభాష్ పుట్టినరోజు వేడుకలు తమ చిన్నారుల సమక్షంలో తమ ఆశ్రమంలో జరపడం ఎంతో ఆనందదాయకంగా ఉందన్నారు. మంత్రి సుభాష్ అందరి ఆశీస్సులు అందుకుని సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇళ్ల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణ గ్రామంలో అందించే పౌర సేవలపై ఆరాతీసిన ఎంపీడీఓ రాజేశ్వర్



**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా, కాట్రేనికోన మండలం, పల్లం గ్రామపంచాయతీ స్వర్ణ గ్రామాలను ఎంపీడీఓ బి రాజేశ్వర్ ఉదయం 10:00 గంటలకు సందర్శించగా సిబ్బంది అందరూ ఉదయం 9:30 గంటలకే శతశాతం హాజరు నమోదు చేయడంపై ఎంపీడీఓ హర్షం వ్యక్తం చేశారు. స్వర్ణ గ్రామంలో అందించే పౌర సేవలపై ఆరాతీశారు.మరింత బాధ్యతగా పౌర సేవలను ప్రజా నీకానికి అందించాలని, సంపూర్ణ జవాబుదారీతనం వహించాలని స్పష్టం చేశారు.విధుల నిర్వాహణలో అలసత్వం వహించరాదని హితవు పలికారు.సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజానీకానికి మరింత చేరువ చేయాలని పిలుపునిచ్చారు.సందర్శనలో పంచాయతీ కార్యదర్శి భాగయ్య స్వర్ణ గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.

### కరుణించు వరుణ దేవా వాడపాలెం సెంటర్లో

## అంగరంగ వైభవంగా కప్పల పెళ్లి వేడుక





**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** మండిపోతున్న ఎండలు వరుణుడి కరుణ కోసం వాడపాలెంలో కప్పలకు పెళ్లి భజంత్రీల మోతలు, కప్పల ఊరేగింపు.. వర్షాల కోసం వాడపాలెం గ్రామస్తుల వినూత్న పూజలు కోనసీమలో కప్పల కళ్యాణం వానలు కురవాలని ప్రాచీన ఆచారానికి ప్రాణం పోసిన వాడపాలెం వాసులు కరుణించు వరుణ దేవా వాడపాలెం వంతెన సెంటర్లో అంగరంగ వైభవంగా కప్పల పెళ్లి వేడుక కొత్తపేట, డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాష్ట్రవ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి.రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వర్షాకాలం సమీపిస్తున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో అన్నదాతలతో పాటు సామాన్య ప్రజానీకం తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో వరుణ దేవుడిని ప్రసన్నం చేసుకునేందుకు డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట మండలం, వాడపాలెం గ్రామస్తులు ఒక వినూత్నమైన, పురాతనమైన ఆచారాన్ని తెరపైకి తెచ్చారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుకుంటూ గ్రామస్తులంతా కలిసి ఘనంగా 'కప్పల పెళ్లి' జరిపించారు. వాడపాలెం గ్రామంలోని వంతెన సెంటర్ వద్ద డాక్టర్ పెద్దింటి రామం పురోహితులు మరియు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వరుణ దేవుడు కరుణించి తొలకరి జల్లులు కురిపించాలని, తద్వారా పాడిపంటలతో గ్రామం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ గ్రామస్థులందరూ ఏకతాటిపైకి వచ్చి ఈ వేడుకను జరిపారు. పూర్వకాలం నుంచి వస్తున్న నమ్మకం ప్రకారం, కప్పలకు శాస్త్రోక్తంగా వివాహం చేస్తే వర్షాలు తప్పక కురుస్తాయని స్థానికులు విశ్వసిస్తున్నారు. రెండు కప్పలను పట్టుకొచ్చి, వాటికి పసుపు, కుంకుమ రాసి, పూలతో అందంగా అలంకరించి సంప్రదాయబద్ధంగా వివాహం జరిపించారు. అనంతరం డప్పులు, భజంత్రీల వాయిద్యాల నడుమ కప్పల జంటను గ్రామ వీధుల్లో అత్యంత వైభవంగా ఊరేగించారు. యువకులు ఉత్సాహంగా డప్పులు వాయిస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ వినూత్న వేడుకను చూసేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రజలు ఆసక్తిగా తరలివచ్చారు. ప్రకృతి కరుణించి వెంటనే వర్షాలు కురవాలని గ్రామస్తులు ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

## అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-యస్ ఐ ఆర్ 2026 కార్యక్రమం నిర్వహించబడుచున్నది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రస్తుతం అమలులో ఉన్న 2025 ఓటర్ల జాబితాలోని ఓటర్ల వివరాలను 2002 ప్రత్యేక సమగ్ర సవరణ (యస్ ఐ ఆర్-2002) ఓటర్ల జాబితాతో అనుసంధానం (మ్యాపింగ్) చేసి, ఓటర్ల జాబితా యొక్క ఖచ్చితత్వం, పారదర్శకత మరియు సమగ్రతను నిర్ధారించేందుకు చర్యలు చేపట్టబడుతున్నాయి. ప్రారంభ ఎన్యూమరేషన్ దశలో ది.15.06.2026 (సోమవారం) నుండి ది.14.07.2026 (మంగళవారం) వరకు బూత్ స్థాయి అధికారులు (బి ఎల్ ఓ లు) ఇంటింటికి వెళ్లి ప్రతి నమోదిత ఓటరుగా ఎన్యూమరేషన్ ఫారమ్ అందజేస్తారు. ఓటర్లు తమ వ్యక్తిగత వివరాలను సరిచూసుకుని, అవసరమైన సమాచారాన్ని ఫారమ్‌లో పూర్తిగా నమోదు చేసి సంబంధిత బిఎల్ఓలకు తిరిగి అందజేయవలసిందిగా కోరడమైనది. ప్రతి ఓటరు ఎన్యూమరేషన్ ఫారమ్‌ను తప్పనిసరిగా పూర్తి చేసి సమర్పించడం ద్వారా ఓటర్ల జాబితా మరింత ఖచ్చితంగా రూపొందించబడుతుంది. అదేవిధంగా,ది.01.07.2026 ను అర్హత తేదీగా పరిగణించి, ఆ తేదీ నాటికి 18 సంవత్సరాల వయస్సు పూర్తి చేసుకున్న అర్హులైన పౌరులు ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలి.



# ప్రారంభమైన కరప–అరట్లకట్ట రహదారి పనులు



**కరప, విశ్వం వాయిస్ న్యూస్ :** కరప గ్రామం నుంచి అరట్లకట్ట వరకు రూ.2 కోట్ల 25 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న 3.2 కిలోమీటర్ల సిమెంట్ రోడ్డు (సీసీ) రహదారి నిర్మాణ పనులు బుధవారం పునఃప్రారంభమయ్యాయి. గత వైసీపీ పాలనలో నిలిచిపోయిన ఈ పనులకు ఎమ్మెల్యే పంతం నానాజీ చొరవతో మళ్లీ శ్రీకారం చుట్టడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు జనసేన మండల అధ్యక్షుడు బండారు మురళి, గొర్రెపూడి నీటి సంఘం అధ్యక్షుడు జొౌక్కా అప్పలరాజు తదితర నాయకులు మాట్లాడుతూ కరప నుంచి అరట్లకట్ట వరకు గ్రామాల పరిధిలో ఏడు మీటర్ల వెడల్పుతో సీసీ రోడ్డు నిర్మాణంతో పాటు రహదారికి ఇరువైపులా డ్రైనేజీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గ్రామాల మధ్య భాగంలో ఏడు మీటర్ల వెడల్పుతో తారు రోడ్డు, రెండు వైపులా డ్రైనేజీ వ్యవస్థను కూడా అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో 2022లో ఈ రహదారి పనులు ప్రారంభమైనప్పటికీ, కొంత మేర డ్రైనేజీలు నిర్మించిన అనంతరం కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే నిలిపివేయడంతో ప్రాజెక్టు అసంపూర్తిగా మిగిలిపోయింది. దీంతో రహదారి గుంతలమయంగా మారి వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అరట్లకట్ట, గొడ్డటిపాలెం, జడ్ బావరం, కొరుపల్లి గ్రామాల ప్రజలు మండల కేంద్రం కరపకు రాకపోకల కోసం ఈ రహదారిపైనే ఆధారపడుతున్నారు. రహదారి దుస్థితి కారణంగా పలువురు ప్రమాదాలకు గురై గాయపడగా, గతంలో నిర్మించిన డ్రైనేజీలో పడిపోయి ఒకరు మృతి చెందిన ఘటన కూడా చోటుచేసుకుంది. ఈ సమస్యను జనసేన నాయకులు ఎమ్మెల్యే పంతం నానాజీ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో చర్చించి నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించేలా చర్యలు చేపట్టారు. బుధవారం పనులు పునఃప్రారంభం కావడంతో ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే పంతం నానాజీకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కరప జనసేన మండలాధ్యక్షుడు బండారు మురళి, గొర్రిపూడి నీటి సంఘం అధ్యక్షులు జొౌకా అప్పలరాజు (తాతాజీ), గొడ్డటి పాలెం జనసేన అధ్యక్షులు వీరం రెడ్డి ముత్యాలరావు, బోనస్ పుల్లయ్య ప్రసాద్, రెడ్డి లావరాజు, తోట కృష్ణ, మొదలగు కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# రెండేళ్ల నమ్మకం-అభివృద్ధి, సంక్షేమం వేడుకల వేదిక మార్పు

**సూర్యకళా మందిర్‌లో సాయంత్రం 3గంటల నుండి 5గంటల వరకు : జిల్లా కలెక్టర్**



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా స్థాయిలో 18వ తేదీ గురువారం ఉదయం ప్రతిపాడులో జరుపవలసిన రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం వేడుకలను కాకినాడలోని సూర్యకళామందిరంలో అదే రోజు మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎం.ఎస్.హరేంధిర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రత్తిపాడులో బుధవారం కురిసిన భారీ వర్షం కారణంగా రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం వేడుకల నిర్వహణకు సిద్ధం చేస్తున్న సభాస్థలం నీటితో నిండి బురదగా మారిన దృష్ట్యా గురువారం నిర్వహించే ఈ కార్యక్రమ వేదికను ప్రతిపాడు నుండి కాకినాడలోని సూర్యకళామందిరం ఆడిటోరియంకు మార్చి, వేడుకలను మధ్యాహ్నం 3 గంటల నుండి నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. కావున ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, ప్రభుత్వ శాఖల అధికారులు, జిల్లా ప్రజలు ఈ అంశాన్ని గమనించి కాకినాడలో జరిగే రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం వేడుకలకు హాజరై విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# నీట్ పరీక్ష అభ్యర్థులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం

**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఈ నెల 21వ తేదీ ఆదివారం నిర్వహించనున్న నీట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులందరికీ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు కాకినాడ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎంయువి మనోహర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ జిల్లా పరిధిలోని కాకినాడ, తుని డిపో బస్ స్టేషన్ల నుంచి పరీక్షా కేంద్రాలకు ప్రత్యేకంగా బస్సులు నడుపుతున్నట్లు ఆయన వెల్లడించారు. నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్ టికెట్‌ను చూపించి పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బస్ స్టేషన్లలో సహాయక సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సదుపాయాన్ని నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజా రవాణా అధికారి కోరారు.

# మంత్రి వాసంశెట్టి సుభాష్ జన్మదిన కానుక

**నిరుపేద కుటుంబానికి నూతన గృహం ఏర్పాటు - గృహప్రవేశం చేయించి పేద కుటుంబానికి ఇంటిని అందజేసిన మంత్రి**



**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** తన జన్మదిన వేడుకల్లో భాగంగా ఓ నిరుపేద కుటుంబానికి మంత్రి సుభాష్ ప్రత్యేక కానుకను అందజేశారు. నిలువ నీడలేని ఆ కుటుంబానికి సొంతింటి కల నిజం చేశారు. మంత్రి సుభాష్ చొరవతో నిర్మితమైన ఆ ఇంటిని తన జన్మదినం రోజునే నిరుపేద కుటుంబానికి అందజేసి వారి కళ్ళల్లో ఆనందాల్ని పూయించారు. వివరాల్లోకి వెళితే.. కాజులూరు మండలం గొల్లపాలెం శివారు ధనలక్ష్మి పేటకు చెందిన సుందరపల్లి జ్యోతి భర్త చనిపోవడంతో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల కారణంగా కనీసం నిలువ నీడలేక తీవ్ర ఇబ్బందికి గురైంది. ఐతే కొద్ది నెలల క్రితం రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ గొల్లపాలెం పర్యటనలో ఉండగా జనసేన నాయకులు దేగల సతీష్, స్థానిక నాయకులు ఆ కుటుంబ దుస్థితిపై మంత్రికి వివరించారు. దీనికి స్పందించిన మంత్రి సుభాష్ ఆ కుటుంబానికి ఇల్లు కట్టించి వారిని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆయన కొంత నగదును అందజేశారు. అనంతరం మంత్రి సుభాష్ సూచన మేరకు జనసేన నాయకులు దేగల సతీష్ ఆ ఇంటి నిర్మాణ బాధ్యతల్ని చేపట్టి మంత్రి సుభాష్ జన్మదినం నాటికి అందుబాటులోకి తెచ్చారు. ఈ మేరకు మంత్రి సుభాష్ జన్మదిన వేడుకల్లో భాగంగా నిర్మించిన నూతన గృహాన్ని బుధవారం మంత్రి సుభాష్ స్వయంగా ప్రారంభోత్సవం చేసి నిరుపేద కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టినరోజు సందర్భంగా ఒక కుటుంబానికి ఇల్లు నిర్మించి ఇవ్వడం చాలా సంతృప్తినిచిందని ఆనందం వ్యక్తం చేశారు. ఇంటి నిర్మాణం కోసం తాను కొంత అమౌంట్ ఇవ్వగా మిగతా బాధ్యతలు మొత్తం దేగల సతీష్ తనపై వేసుకుని బాధ్యతతో ఇంటి నిర్మాణం పూర్తి చేయడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సతీష్ ని మంత్రి సుభాష్ ప్రత్యేకంగా అభినందించారు. తన జన్మదినం రోజున పేద కుటుంబం నూతన గృహప్రవేశం చేయడం ఎంతో సంతృప్తి నిచ్చిందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, టీడీపీ క్లస్టర్ ఇన్చార్జ్ పలివెల రాజు, జనసేన నాయకులు చిక్కాల దొరబాబు, టీడీపీ సీనియర్ నాయకులు చుండ్రు వీర్రాజు చౌదరి, మండల టీడీపీ మహిళా అధ్యక్షురాలు సోమాలమ్మ, సొసైటీ అధ్యక్షులు అంగర కృష్ణ, పితాని సతీష్, వల్లు అర్జునరావు, ధరణి, జనసేన నాయకులు పుల్లెపు ఆనంద్, నానీ, నక్కా శ్రీను పాల్గొన్నారు.

**జిల్లా గ్రంథాలయంలో పోటీ పరీక్షల కోసం ప్రత్యేక గదిని**

# ప్రారంభించిన రాజోలు టిడిపి ఇన్చార్జ్ అమూల్య



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లా గ్రంథాలయంలో బుధవారం పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల కోసం ఒక ప్రత్యేక గదిని కేటాయించి విద్యార్థులకు కావలసిన సౌకర్యాలతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు భూపతి రాజు ఈశ్వర్ రాజు వర్మ (సాయిబాబు రాజు)తో కలిసి రాజోలు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ గొల్లపల్లి అమూల్య ఒక గదిని ప్రారంభించారు. ఈ సందర్భంగా భూపతి రాజు, గొల్లపల్లి, మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఒక ప్రశాంతమైన వాతావరణం కావాలని ఉద్దేశంతో అన్ని అంగులతో కావలసిన అన్ని పుస్తకాలతో ఒక ప్రాంగణాన్ని సమకూర్చి నిరంతరం వారికి కావలసిన అవసరాలను పర్యవేక్షించడానికి ఈ ప్రాంగణం ఉపయోగపడుతుందని అన్నారు. ఈ ప్రారంభోత్సవం గ్రంథాలయ సంస్థ సెక్రటరీ కుమారి, గ్రంథాలయ సంస్థ సిబ్బంది, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# బస్టాండ్ ప్రారంభించిన వంగవీటి రాధా



**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా, కాట్రేని కోన మండలం, పల్లంకుర్రు పంచాయతీ పరిధిలో,భూపతి రాజు శివకుమార్ వర్మ (గబ్బర్ సింగ్) ఆర్థిక సహాయంతో నూతనంగా నిర్మించిన బస్టాండ్‌ను వంగవీటి రాధా బుధ వారం ప్రారంభించారు. గ్రామ ప్రజలకు అవసరమైన సేవలను అందించడంలో గబ్బర్ సింగ్ చొరవ అభినందనీయమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ముందుగా పల్లంకుర్రు బస్టాండ్‌లో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి నాయకులుపూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు, తాడి నరసింహారావు, నాగిడి నాగేశ్వరరావు, కంచు స్తంభం కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# లెప్రసీ బాధిత కుటుంబాల్లో ఆశల వెలుగులు

**36 ఇళ్లకు మరమ్మతులు చేయించిన సత్యం వాసంశెట్టి ఫౌండేషన్**



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం పట్టణంలోని సువార్తపేట లెప్రసీ కాలనీలో దశాబ్దాలుగా వర్షాకాలంలో ఇళ్లు కారిపోతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్న 36 కుటుంబాల కష్టాలను సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ తొలగించింది. కాలనీ వాసులు తమ సమస్యను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం దృష్టికి తీసుకువెళ్లగా ఆయన వెంటనే స్పందించి రూ.12 లక్షల వ్యయంతో ఆ ఇళ్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించారు. జూన్ 17న మంత్రి వాసంశెట్టి సుభాష్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని మరమ్మతులు పూర్తయిన ఈ గృహాలను ఆయన చేతుల మీదుగా పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ సమాజంలో వివక్షకు గురవుతున్న లెప్రసీ బాధితుల జీవితాల్లో వెలుగులు నింపి, వారి ముఖాల్లో చిరునవ్వులు చూడటం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. గత 30 ఏళ్లుగా ఎవరూ పట్టించుకోని తమ బాధలను అర్థం చేసుకుని తమను ఆదుకున్న మంత్రి సుభాష్‌కు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్‌కు కాలనీ వాసులు చల్లంగి అనురాధ, కడియాల చంద్రబాబు కృతజ్ఞతలు తెలుపుతూ, వాసంశెట్టి కుటుంబానికి జీవితాంతం రుణపడి ఉంటామని భావోద్వేగంతో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంత్రి జన్మదిన వేడుకలను రెడ్డి సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించగా, ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ పేద ప్రజలకు సేవ చేయడం తమ అదృష్టమని భవిష్యత్తులో కూడా ఎలాంటి అవసరం వచ్చినా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి పార్టీ నాయకులు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

**రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు**

# అద్దంపల్లి విద్యార్థి ప్రణీల్ కుమార్ ఎంపిక



**కె.గంగవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కె.గంగవరం మండలం అద్దంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి వై.వి.ఎస్. ప్రణీల్ కుమార్ రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యాడు. అమలాపురంలోని గోదావరి భవన్‌లో సోమవారం నిర్వహించిన 'యోగాంధ్ర-2026' జిల్లా స్థాయి యోగా పోటీల్లో 10 నుండి 18 సంవత్సరాల సోలో విభాగంలో ప్రణీల్ కుమార్ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి అర్హత సాధించాడు. ఈ విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.వెంకట రమణ తెలిపారు. ఎంపికైన ప్రణీల్ కుమార్ జూన్ 18 నుండి విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి యోగా పోటీలలో పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధి కమిటీ ప్రదాత దాసరి సత్తిరాజు (పెద్దకాపు) మరియు గ్రామ పెద్ద కొప్పిశెట్టి నారాయణమూర్తి (బుజ్జి) మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో కూడా ప్రణీల్ కుమార్ ఉత్తమ ప్రతిభ కనబర్చి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థి ప్రతిభను చూసి పాఠశాల విద్యా కమిటీ చైర్మన్, సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయుడు షేక్ అలీమ్ పాషా, తోటి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు స్థానిక ప్రజలు అతన్ని అభినందించారు.

# మహిళా సాధికారతే లక్ష్యం

**రూ. కోటి వ్యయంతో వందలాది మందికి ఉపాధి కల్పించిన మంత్రి వాసంశెట్టి సుభాష్**



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజకవర్గంలో మహిళల జీవన ప్రమాణాలను మెరుగుపరిచి వారు సొంతంగా ఆర్థిక స్థిరత్వాన్ని సాధించడమే లక్ష్యంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని నియోజక వర్గంలో సుమారు రూ. కోటి నిధులతో 130 మంది మహిళలకు వివిధ రంగాల్లో వృత్తి శిక్షణ అందించడమే కాకుండా, వారు స్వయం ఉపాధి పొందేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు. జ్యూట్ బ్యాగ్ తయారీ, బ్యూటీ పార్లర్, మగ్గం వర్క్, ప్రెస్డ్ ఆయిల్ యూనిట్, మష్రూమ్ తయారీ, శానిటరీ ప్యాడ్స్, టిష్యూ పేపర్ తయారీ వంటి విభాగాల్లో శిక్షణ ఇచ్చి, మంత్రి సమక్షంలోనే మహిళలతో కుటీర పరిశ్రమలను ప్రారంభించారు. మహిళలకు ఆటో డ్రైవింగ్‌లో కూడా శిక్షణ ఇవ్వడం విశేషం. ఈ ఏడాదిలోనే వెయ్యి మంది మహిళలకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ మరియు సిఎస్ఆర్ నిధులను వినియోగించి ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. 'మహిళా అడ్డా' పేరుతో నియోజకవర్గంలోని నిరుపయోగంగా ఉన్న పాత కమ్యూనిటీ హాళు,, సినిమా హాళ్లు మరియు షెడ్లను పునరుద్ధరించి మహిళలు తమ వ్యాపారాలను నిర్వహించుకునేందుకు వీలుగా సిద్ధం చేశారు. ఈ కేంద్రాలు కేవలం మహిళల ఉపాధికి మాత్రమే కాకుండా పేద మరియు మధ్యతరగతి కుటుంబాలు తక్కువ ఖర్చుతో శుభకార్యాలు జరుపుకునేందుకు కూడా అందుబాటులో ఉండనున్నాయి. మహిళా అభ్యుదయ వేదిక ద్వారా నియోజకవర్గ వ్యాప్తంగా సమావేశాలు ఏర్పాటు చేసి ఉత్సాహవంతులైన మహిళలను ప్రోత్సహించడం, వారికి అవసరమైన మార్గదర్శకత్వం అందించడం వంటి పనులు నిరంతరం కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగానే రూ. 20 లక్షల వ్యయంతో 'సహారా మిల్లెట్ కేఫ్'ను మంత్రి ప్రారంభించి మహిళలకు అప్పగించారు. మిల్లెట్స్ ఆధారిత ఉత్పత్తుల విక్రయం ద్వారా వారు ఆర్థికంగా ఎదిగేలా ప్రణాళిక సిద్ధం చేశారు. అలాగే నరసాపురపుపేట వద్ద అరోమా ఫుడ్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో రూ. 2 కోట్ల వ్యయంతో స్పైసెస్, మసాలా దినుసుల పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. ఈ పరిశ్రమ ద్వారా గ్రామీణ మహిళలకు భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. కేవలం ఉపాధి మాత్రమే కాకుండా విద్యార్థుల సంక్షేమంపై కూడా దృష్టి సారించిన మంత్రి, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా 137 మంది అనాథ మరియు నిరుపేద విద్యార్థులను దత్తత తీసుకుని వారి విద్యాభ్యాసానికి పూర్తి బాధ్యత వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి కోసం ఇంతలా కృషి చేస్తుంటే, స్థానిక వైసిపి నాయకుడు పిల్లి సూర్యప్రకాశ్ దీనిపై అనవసరమైన విష ప్రచారం చేస్తూ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. చేతనైతే ప్రజలకు మేలు చేసే పనులు చేయాలని సవాల్ విసిరారు. ప్రజలందరూ అన్నీ గమనిస్తున్నారని, తగిన సమయం వచ్చినప్పుడు వారికి తగిన సమాధానం లభిస్తుందని ఆయన హెచ్చరించారు. ఫౌండేషన్ ద్వారా శిక్షణ పొంది సొంతంగా పరిశ్రమలు ప్రారంభించిన మహిళలు తమ జీవితాల్లో మార్పు తెచ్చిన మంత్రికి, ఫౌండేషన్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి సహోదరి వాసంశెట్టి శ్రీ సత్యం,కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**రామచంద్రపురం బస్టాండ్‌లో**

# 'శక్తి యాప్', 'డ్రగ్స్ వద్దు బ్రో'పై విస్తృత అవగాహన




**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రాపురం బస్టాండ్ ప్రాంగణంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో మహిళల రక్షణ, యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వక్తగా పాల్గొన్న హెడ్ కానిస్టేబుల్ మనోహర్ గ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళల భద్రత అత్యంత కీలకమని ఆపదలో ఉన్నప్పుడు మహిళలు తక్షణమే స్పందించేందుకు వీలుగా ప్రభుత్వం రూపొందించిన 'శక్తి యాప్' వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ యాప్‌ను ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి మరియు అత్యవసర సమయాల్లో పోలీసులకు సమాచారం ఎలా అందించాలనే అంశాలను ఆయన ప్రజలకు, ప్రయాణికులకు వివరించారు. అదేవిధంగా, యువతను పెడదోవ పట్టిస్తున్న మాదక ద్రవ్యాల (డ్రగ్స్) దురాచారంపై ఆయన తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. 'డ్రగ్స్ వద్దు బ్రో' అనే నినాదంతో చేపట్టిన ఈ అవగాహనలో భాగంగా డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్య సమస్యలు మరియు చట్టపరమైన ఇబ్బందుల గురించి హెడ్ కానిస్టేబుల్ మనోహర్ సవివరంగా తెలియజేశారు. యువత తమ విలువైన సమయాన్ని చదువు మరియు ఉన్నత లక్ష్యాల వైపు మళ్లించాలని మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, విద్యార్థులు, ప్రయాణికులు మరియు పలువురు సిబ్బంది పాల్గొని పోలీసుల సూచనలను శ్రద్ధగా ఆలకించారు.

# ఎన్‌సిసి అధికారిగా 31 ఏళ్ల విశిష్ట సేవలకు గుర్తింపు

**లెఫ్టినెంట్ హోదాను అందుకున్న ప్రధానోపాధ్యాయులు ఉప్పలపాటి మాచిరాజు**



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం పట్టణానికి చెందిన విద్యావేత్త, నరసాపురపుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఉప్పలపాటి మాచిరాజుకి అరుదైన గౌరవం దక్కింది. గత 31 సంవత్సరాలుగా ఎన్.సి.సి అధికారిగా ఆయన ఎంతో నిబద్ధతతో అందించిన విశిష్ట సేవలను భారత ప్రభుత్వం గుర్తించింది. ఆయన చేస్తున్న కృషికి గుర్తింపుగా ఇండియన్ ఆర్మీలో ప్రతిష్టాత్మకమైన 'లెఫ్టినెంట్' హోదాను కల్పిస్తూ భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదంతో అధికారిక గెజిట్‌లో ఆయన పేరును ముద్రించారు. ఈ అరుదైన ఘనత సాధించినందుకు పాఠశాల ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు అమితమైన ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈరోజు పాఠశాల ప్రాంగణంలో ఆయనకు ఘనమైన సత్కార కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాచిరాజు గారు మాట్లాడుతూ ఈ గౌరవం తన బాధ్యతను మరింత పెంచిందని విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషిని కొనసాగిస్తానని పేర్కొన్నారు. ఆయన సాధించిన ఈ విజయం రామచంద్రాపురానికే గర్వకారణమని తోటి ఉపాధ్యాయులు, విద్యావేత్తలు కొనియాడారు.



# "రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" జిల్లా స్థాయి కార్యక్రమం

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో "రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" జిల్లా స్థాయి కార్యక్రమం స్థానిక శ్రీ వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో కలెక్టర్ కీర్తి చేకూరి అధ్యక్షతన నిర్వహించారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామా నాయుడు, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా "రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత రెండేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, వివిధ రంగాల్లో సాధించిన ప్రగతి, లబ్ధిదారుల జీవితాల్లో వచ్చిన మార్పులను ప్రజలకు తెలియజేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని మంత్రులు పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, పారదర్శక పాలన, విద్య, వ్యవసాయం, మౌలిక వసతులు, మహిళా సాధికారత, ఉపాధి కల్పన తదితర రంగాల్లో సాధించిన విజయాలను ప్రజలకు చేరవేసేందుకు ఈ కార్యక్రమం వేదికగా నిలుస్తోందన్నారు. ఈ సందర్భంగా సభాధ్యక్షురాలు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, "విద్య"ను ప్రధాన అంశంగా కేటాయించి ఈ రెండేళ్ల వేడుకలను నిర్వహించినట్లు తెలిపారు. గత రెండేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, లబ్ధిదారుల విజయగాథలను ప్రత్యేక స్టాళ్ల ద్వారా ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ, 2014–19 మధ్యకాలంలో రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాదులు ఏర్పడ్డాయని, అనంతర కాలంలో అభివృద్ధి కార్యక్రమాల అమలులో కొన్ని అంతరాయాలు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. గత ఐదేళ్లలో నిలిచిపోయిన అనేక అభివృద్ధి కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో తిరిగి గాడిలో పెట్టిందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఏర్పడిన ఆర్థిక సవాళ్లు ఉన్నప్పటికీ ప్రజలకు సంక్షేమ పథకాల అమలులో ఎటువంటి ఆటంకం కలగకుండా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. భారతదేశాన్ని ప్రపంచ వేదికపై మరింత బలోపేతం చేయడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక పాత్ర పోషిస్తున్నారని , అదే విధంగా విజన్ కలిగిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక పాత్ర పోషిస్తున్నారని మంత్రి కొనియాడారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం, రాష్ట్రం సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు మెరుగైన పరిపాలన అందుతోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ కాలంలో ఎదురైన సవాళ్లను అధిగమిస్తూ రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రభుత్వం ముందుకు వెళ్తోందని, లబ్ధిదారుల జీవితాల్లో వచ్చిన మార్పులు అందుకు నిదర్శనమని తెలిపారు. తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ భాగస్వామ్యంతో ఏర్పడిన కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజా సంక్షేమ దృక్పథం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని చెప్పారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, స్త్రీశక్తి, పెన్షన్ల పంపిణీ, ధాన్యం కొనుగోలు వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు విస్తృత ప్రయోజనాలు అందుతున్నాయని తెలిపారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, కొవ్వూరు ఎమ్మెల్యే ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, అనపర్తి ఎమ్మెల్యే ఎమ్మెల్యే నల్లమిల్లిరామకృష్ణారెడ్డి, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ తమ నియోజక వర్గాల్లో జరిగిన అభివృద్ధి వివరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, డి. ఆర్. ఓ. ఎస్. భాస్కర్ రెడ్డి, ఆర్. డి. ఓ. ఆర్. శివరాముడు, జిల్లా స్థాయి అధికారులు, తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, సభ్యులు, అధికారులు, లబ్ధిదారులు, డ్వాక్రా సంఘాల మహిళలు, సూపర్ సిక్స్ మరియు ఇతర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# దుర్గమ్మ గుడి హుండీపై దొంగల కన్ను

**అర్ధరాత్రి హుండీ పగులకొట్టి చోరీ.. భక్తుల ఆగ్రహం**



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా, రాయవరం మండలం, చెల్లూరు గ్రామ శివారులో గల కనక దుర్గమ్మ అమ్మవారి ఆలయంలో దొంగలు మంగళవారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. అర్ధరాత్రి సమయంలో ఆలయంలోకి ప్రవేశించిన గుర్తుతెలియని వ్యక్తులు హుండీని పగులగొట్టి అందులోని నగదును ఎత్తుకెళ్లిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. గ్రామస్తులు, ఆలయ సంఘం పెద్దలు తెలిపిన వివరాల ప్రకారం, ఈ హుండీని సంవత్సరానికి ఒక్కసారే తెరుస్తారని. భక్తులు ఏడాది పొడవునా సమర్పించిన కానుకలతో హుండీలో సుమారు రూ.20 వేల నుంచి రూ.40 వేల వరకు నగదు ఉండవచ్చని వారు అంచనా వేస్తున్నారు. దొంగలు హుండీని ధ్వంసం చేసి నగదుతో పరారైనట్లు గుర్తించారు. ఉదయం ఆలయానికి వచ్చిన భక్తులు హుండీ పగులగొట్టబడిన విషయం గమనించి గ్రామ పెద్దలకు సమాచారం అందించారు. ఆలయ భద్రతపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తూ, గ్రామ శివారులో ఉన్న దేవాలయాలకు రక్షణ చర్యలు పెంచాలని కోరుతున్నారు. ఈ ఘటనపై రాయవరం ఎస్సై సురేష్‌బాబు ను వివరణ కోరగా, ఆలయ హుండీ చోరీకి సంబంధించిన ఘటన పై ఇప్పటివరకు తమకు ఎలాంటి అధికారిక ఫిర్యాదు అందలేదని తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.


# పాఠశాలలో కంప్యూటర్స్ దాతల ద్వారా ఏర్పాటుకు హామీ




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పాఠశాల ల్యాబ్‌కు అవసరం అయిన కంప్యూటర్స్, ప్రింటర్ లను దాతల ద్వారా ఏర్పాటు చేస్తామని తెలుగుదేశం నగర మైనారిటీ సెల్ అధ్యక్షులు సాల్మన్ జయరాజ్ హామీ ఇచ్చారు. ఈరోజు స్థానిక జాంపేట లూథరన్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్రలో భాగంగా విద్యార్థులకు టెక్స్ట్ బుక్స్ మరియు నోట్ బుక్స్ పంపిణీ చేయడం జరిగింది. తెలుగుదేశం నగర మైనారిటీ సెల్ అధ్యక్షులు సాల్మన్ జయరాజ్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల కోసం అనేక మంచి కార్యక్రమాలు అమలు చేస్తుందని విద్యార్థులు బాగా చదువు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండంట్ ఎమ్. ఐజయ, ప్రధానోపాధ్యాయురాలు బి. హెచ్. జెమిమా, వార్డ్ ఇంచార్జి శ్యామ్, జనసేన వార్డ్ ఇంచార్జి వీరబాబు, ఏసీ వర్కర్స్ జిల్లా అధ్యక్షులు కుమార్, టి. మార్టిన్ సుధాకర్, ఎమ్. జి. ప్రియదర్శిని, వై. అరుణ్ కిరణ్ తదితరులు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రాచీన కళలకు కంబాల ప్రోత్సాహం

**కళా సమ్మేళనం కార్యక్రమానికి రెండు లక్షలు రూపాయలు విరాళం**





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మన సంస్కృతికి, చరిత్రకు మూలధారమైన ప్రాచీన కళలను పరిరక్షించడం కోసం విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ–1 కంబాల శ్రీనివాసరావు తన వంతు ప్రోత్సాహం అందిస్తున్నారని, రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు అన్నారు. రాజమండ్రి రివర్ బే లోని ఆహ్వానం ఫంక్షన్ హాల్ లో ఈ నెల 11 నుంచి 14 తేదీ వరకు శ్రీ రాధాకృష్ణ కళాక్షేత్ర వారి కళా సమ్మేళనం (2026) ఇంటర్నేషనల్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ ఫెస్టివల్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కంబాల శ్రీనివాసరావు అందుబాటులో లేకపోవడంతో ఆయన ఆదేశాల మేరకు రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు ఆదివారం రాత్రి ముఖ్య అతిధులు పాల్గొన్నారు. తొలిత వారికి నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. ఆడిటోరియంలో వెంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన, పలు డ్యాన్స్, సాంస్కృతిక, మ్యూజిక్ కార్యక్రమాలను తిలకించారు. ఈ కళా సమ్మేళనం డాన్స్ ఫెస్టివల్ కార్యక్రమానికి కంబాల శ్రీనివాసరావు రెండు లక్షలు రూపాయలు విరాళం ప్రకటించారు. ఈ విరాళాన్ని రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బత్తుల నానాజీ, కంబాల యువసేన అధ్యక్షులు ఉంగరాల మణిరత్నం, పెద్దాడ వెంకన్న దొర, నాగరమేష్, వీరాంజలి, దేశాల నరేష్, రాయపాటి సత్యనారాయణ, మళ్ల అధిశేషు, గనిరాజు, ధార శ్రీను, బుల్లబ్బాయి, కాకర దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

# రాజమండ్రి ప్రభుత్వాసుపత్రిలో రెచ్చిపోతున్న మాఫియా

**వైద్య సేవలు అందించటంలో నిర్లక్ష్యం.. – వైద్య సిబ్బంది మోసాలు.. కేసు నమోదు చేయకుండా చికిత్స – ఆసుపత్రి ఆవరణలో దళారుల హవా**
**రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ నాయకురాలు నాగూరి అన్నపూర్ణ , మాసా దుర్గ – వైద్యులపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలని మేడా శ్రీనివాస్ డిమాండ్**





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక క్వారి ప్రాంతంలో గల సుబ్బారావునగర్లో గత కొన్ని రోజులుగా గూండాల దాడులతో భయభ్రాంతులకు స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఒక 10 రోజులు క్రితం గెద్దాడ సుందరి ఇంటిపై దాడిచేసి సామానులు, ఇంటి అద్దాలను పగులగొట్టిన దుండుగులు చర్యలు పై పోలీస్ కు పిర్యాదు చేసినా స్పందించలేదు. పోలీస్ వారు చర్యలు చేపట్టక పోవటాన్ని అలుసుగా చేసుకున్న దుండుగులు నిన్న రాత్రి మరో సారి మహిళలపై కత్తులు , రాడ్లు తో దాడికి తెగబడ్డారు . గాయపడిన బాధితులు రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రి కి వైద్యం కోసం వెళ్లగా వైద్య సేవలు అందించటంలో నిర్లక్ష్యం వహించారు. వైద్యురాలు నీలిమా మేడమ్ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది కొరతగా వుంది. ఒక్కరిని మాత్రమే జాయిన్ చేసుకోవటం కుదురుతుంది అని తీవ్ర గాయాలతో ఉన్నటువంటి మాసా సుభద్రను రాత్రి ఆసుపత్రిలో చేర్చుకుని మిగిలిన క్షతగాత్రులకు నామ మాత్రపు వైద్య సేవలు చేసి ప్రైవేట్ వైద్యంకు వెళ్ళిపోమని అసహనం వ్యక్తం చేశారు. మరునాడు రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ అధ్యక్షులు మేడా శ్రీనివాస్ , సీనియర్ సెక్యులర్ పెండ్యాల కామరాజు బాధితురాలును ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి ఆసుపత్రి వర్గాలను పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి రికార్డులలో పెషేంట్ వివరాలు నమోదు చేయకుండానే వైద్యం చేస్తున్నట్టు గమనించిన మేడా శ్రీనివాస్ ఆసుపత్రి వర్గాలను నీలాదీశారు . అప్పటికప్పుడు ఆసుపత్రి రికార్డుల నందు ఎంట్రీ పెట్టి స్కానింగ్ కు పంపి పోలీస్ వారికి తెలియచేసారు. ఆసుపత్రి ప్రాంగణంలో కొంత మంది డా. నీలిమాతో మెరుగైన వైద్య సేవలు అందే విధంగా చేస్తాం అంటు విచ్చలవిడిగా కొంతమంది దళారులు బాహటంగా సంప్రదింపులు జరుపుతున్నట్లు గమనించిన మేడా శ్రీనివాస్ నేరుగా ఆర్ ఎమ్ ఓ కు పిర్యాదు చేసారు. రాత్రి నుండి జరిగిన వైద్య పరమైన నిర్లక్ష్యం పైన, డాక్టర్ అధికార దుర్వినియోగ చర్యలు పైన తక్షణమే శాఖా పరమైన చర్యలు చేపట్టాలని మేడా శ్రీనివాస్ కోరారు. రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక తరహా మాఫియాతో రోగులు ఆందోళనకు గురి అవుతున్నారు. బాధితులను ఆర్థికంగా దోచుకుంటున్నారు. ఆసుపత్రి వర్గాలకు తెలియపరిచినా పట్టించు కోకపోగా పిర్యాది తాలూకా రోగుల పట్ల చిరాకు, పరాకులు కనపరుస్తున్నారు. జిల్లా కలెక్టర్, సంబంధిత అధికార యంత్రాంగం అధికార దుర్వినియోగానికి బాధ్యత వహిస్తున్న వైద్యులపై శాఖా పరమైన చర్యలు చేపట్టాలని మేడా శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు.

# వైసీపీ కేడర్ అప్రమత్తంగా ఉండాలి

**ఎస్ఐఆర్ ప్రక్రియపై**

**మాజీ ఎంపీ, వైసీపీ జాతీయ అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన ప్రత్యేక ఓటర్ల సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ పట్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేడర్ అప్రమత్తంగా ఉండాలని మాజీ ఎంపీ, వైసీపీ జాతీయ అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ పిలుపునిచ్చారు. బుధవారం నగర వైఎస్ఆర్సీపీ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, వార్డు ఇన్‌చార్జీలు, బూత్ లెవల్ ఏజెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియలో అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడాలని, ముఖ్యంగా పార్టీ సానుభూతిపరులు, మద్దతుదారుల ఓట్లు గల్లంతు కాకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రత్యేక ఓటర్ల సవరణ ప్రక్రియలో పార్టీ కేడర్, బూత్ లెవల్ ఏజెంట్లు ఓటర్ల జాబితాలను పరిశీలిస్తూ, బూత్ లెవల్ అధికారులతో (బీఎల్ఓలు) సమన్వయంగా పనిచేయాలని భరత్ తెలిపారు. ఈ ప్రక్రియలో నమోదయ్యే కొత్త ఓటర్ల వివరాలు, సేకరించిన సమాచారం ప్రతిరోజూ నమోదు చేసుకుని, సంబంధిత రసీదులను తీసుకుని భద్రపరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని, రాబోయే రెండు వారాల పాటు వార్డు ఇన్‌చార్జ్‌లు, బూత్ లెవల్ ఏజెంట్లు, పార్టీ నాయకులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి లోపాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో వాసంశెట్టి గంగాధరరావు, మజ్జి అప్పారావు, మార్తి నాగేశ్వరరావు, కాటం రజనీకాంత్, తిరగటి దుర్గారావు, సుభాని, గణేష్ రెడ్డి, మార్గాని రాము, మరిశెట్టి వెంకటేశ్వరరావు తదితర నాయకులు, వార్డు ఇన్‌చార్జీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేపర్ మిల్లు మూత పడుతుందనే ఆందోళన వద్దు

**రిటైర్డ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ టీ.కే విశ్వేశ్వరరెడ్డి**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎపి పేపర్ మిల్లు రిటైర్డ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం స్థానిక కృష్ణ సాయి కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించారు. ఆఫీసర్ల సాధక బాధకాలను అడిగి తెలుసుకుని భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. గోదావరి పుష్కరాలకు 12 రోజుల పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు 6గురు సభ్యులతో కమిటీ వేశారు. ఈ సమావేశానికి అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు సిహెచ్ వి రాములు, అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, సెక్రటరీ ఎస్‌పిఎన్ దొర, కోశాధికారి బి. అప్పారావు, ఉపాధ్యక్షులు పిబిఎస్ భాస్కర శర్మ, ఎస్‌వివి రెడ్డి, సంయుక్త కార్యదర్శులు ఎంఆర్ ఎల్ శర్మ, సిహెచ్ ఎస్ వీరభద్రరావు, ఇతర కమిటీ సభ్యులు హాజరయ్యారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ గోదావరి పుష్కరాల నేపథ్యంలో భక్తుల పుణ్యస్నానాలకు పరిశుభ్రమైన నీరు అందించేందుకు కూటమి ప్రభుత్వం తీసుకునే చర్యలకు రిటైర్డ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మద్ధతుగా నిలుస్తుందన్నారు. ఇటీవల ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వెంకటనగరం తూర్పు లంక వద్ద పేపర్ మిల్లు వ్యర్థాలు గోదావరిలో కలుస్తున్న తీరును పరిశీలించడం జరిగిందన్నారు. గోదావరి నది కలుషితం కాకుండా పటిష్ట కార్యాచరణ చేయాలని కోరారు. స్థానిక ప్రజా ప్రతినిధులు పేపర్ మిల్లు కాలుష్యం గురించి అడిగితే మిల్లు మూసేస్తారని చెబుతున్నారని వారికి అటువంటి భయం అక్కర లేదని తమ అసోసియేషన్‌లో 225 మంది ఆఫీసర్లు సభ్యులుగా ఉన్నారన్నారు. మిల్లును సమర్ధవంతంగా నడిపించిన శక్తి సామర్థ్యాలు కలిగిన అధికారులు ఉన్నారని వివరించారు. ప్రస్తుతం పేపర్ మిల్లు ఇడిగా వ్యవహరిస్తున్న ముఖేష్ జైన్ తీరుపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసారు. ఆఫీసర్లు, ఇతర కార్మికులకు సంబంధించిన పిఎఫ్, ఇతర సమస్యలపై మిల్లులోకి వెళ్లేందుకు కూడా అనుమతి ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడ సరికాదన్నారు. గతంలో తామంతా పికె సూరి నేతృత్వంలో ఒక కుటుంబంగా పేపర్ మిల్లులో పనిచేసామని, ప్రస్తుతం ఆ వాతావరణం లేక పోవడం బాధాకరంగా ఉందని వ్యాఖ్యానించారు. అధికారులు, కార్మికుల పట్ల ముఖేష్ జైన్ తన పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. కాశీలో గంగానది తరహాలో దక్షిణ కాశీగా ఉన్న గోదావరి నదిలో కాలుష్యం నివారించి గోదావరి పుష్కరాలు నిర్వహించాలని కోరారు. ఆఫీసర్స్ అసోసియేషన్ పటిష్టంగా ఉందని, సభ్యులందరూ ఐక్యంగా ముందుకు సాగుతూ ఎవరికి ఎటువంటి ఇబ్బంది వచ్చినా వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్టు టీకే తెలిపారు.

# సూర్యనారాయణమూర్తి బాధ్యతలు

**రాయవరం ఎంపీడీవోగా**



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా, రాయవరం మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)గా కె. వి. ఎస్. ఎస్. సూర్యనారాయణమూర్తి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో సీతానగరం మండలంలో డిప్యూటీ ఎంపీడీవోగా విధులు నిర్వహించిన ఆయన, ఇటీవల పదోన్నతి పొంది రాయవరం మండలానికి ఎంపీడీవోగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన సూర్యనారాయణమూర్తిని అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మండల అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థ అమలు, ప్రజలకు మెరుగైన సేవలందించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని ఆయన పేర్కొన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.



# అదే జరిగితే ప్రభాస్ ఫ్యాన్స్‌కు ట్రిపుల్ ట్రీట్..

## డార్లింగ్ సినిమా రిలీజులపై క్రేజీ అప్డేట్

పాన్ ఇండియా సూపర్ స్టార్ ప్రభాస్ ఇప్పుడు చేసేవన్నీ పాన్ ఇండియా సినిమాలే. అందులోనూ భారీ బడ్జెట్ తో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతోన్న చిత్రాలే. ఫౌజీ, స్పిరిట్, కల్కి 2, సలార్ 2.. ఇలా ప్రభాస్ లైనప్ ఇప్పుడు బిజీ బిజీగా ఉంటోంది. పాన్-ఇండియా సూపర్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు . ప్రస్తుతం ఆయన చేతిలో ఉన్నవన్నీ పెద్ద సినిమాలే. అవి కూడా భారీ బడ్జెట్ తో తెరకెక్కుతోన్న పాన్ ఇండియా చిత్రాలే. వీటి విడుదల కోసం ప్రభాస్ అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే అంతా అనుకున్నట్లు జరిగితే, ప్రభాస్ 3 సినిమాలు కేవలం ఒక సంవత్సరంలోనే థియేటర్లలో విడుదల కావచ్చు. అదే జరిగితే ప్రభాస్ ఫ్యాన్స్ కు పండగేనని చెప్పుకోవచ్చు. ప్రస్తుతం ప్రభాస్ చేతిలో 'ఫౌజీ', 'స్పిరిట్' 'కల్కి 2', 'సలార్ 2' సినిమాలు ఉన్నాయి. వీటిలో మొదటగా తెరపైకి రానున్న చిత్రం హను రాఘవపూడి దర్శకత్వం వహించిన 'ఫౌజీ'. ఈ సినిమా షూటింగ్ శర వేగంగా జరగనుంది. ఎలాగైనా ఈ డిసెంబర్ నాటికి చిత్రాన్ని విడుదల చేయడానికి చిత్ర బృందం భారీ ప్రణాళికను సిద్ధం చేసినట్లు సమాచారం. 'అర్జున్ రెడ్డి', 'యానిమల్' ఫేమ్ సందీప్ రెడ్డి వంగా, ప్రభాస్‌ల కాంబినేషన్‌లో వస్తున్న 'స్పిరిట్' చిత్రంపై అంచనాలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఈ సినిమా ప్రీ-ప్రొడక్షన్ పనులు దాదాపుగా పూర్తి కావస్తున్నాయి, త్వరలోనే షూటింగ్ ప్రారంభం కానుంది. తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రం 2027 మార్చిలో విడుదల కావడం దాదాపు ఖాయమని తెలుస్తోంది. 2024లో విడుదల కానున్న, బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించిన 'కల్కి 2898 AD' చిత్రానికి సీక్వెల్ అయిన 'కల్కి 2' కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన ఈ సైన్స్ ఫిక్షన్ చిత్రం అధికారిక విడుదల తేదీ ఇంకా ప్రకటించనప్పటికీ, ఈ చిత్రం 2027 డిసెంబర్ నాటికి తెరపైకి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ ప్రణాళికలు అనుకున్నట్లు సాగితే, డిసెంబర్ 2026 నుంచి డిసెంబర్ 2027 మధ్య కేవలం 12 నెలల వ్యవధిలోనే ప్రభాస్ మూడు భారీ బడ్జెట్ చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు వస్తాడు. అదే జరిగితే ప్రభాస్ ఫ్యాన్స్ కు పండగేనని చెప్పుకోవచ్చు. ఒకే స్టార్ నటుడి నుంచి ఒకే సంవత్సరంలో ఇంత భారీ బడ్జెట్ చిత్రాలు రావడం చాలా అరుదని చెప్పుకోవచ్చు.



# సమంత మజాకా..?

## ఆమె కట్టిన చీర ధర, ప్రత్యేకతలు తెలిస్తే దిమ్మ తిరిగిపోద్ది..



ప్రస్తుతం టాలీవుడ్‌లో 'మా ఇంటి బంగారం' సినిమా ప్రమోషన్ల సందడి జోరుగా సాగుతోంది. ఇందులో హీరోయిన్ సమంత మాస్ యాక్షన్ సీన్స్‌తో పాటు చీరకట్టులో ఆకట్టుకోబోతోంది. ముఖ్యంగా ప్రమోషనల్ ఈవెంట్లలో ఆమె ధరిస్తున్న చీరలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. తాజాగా ఒక ఈవెంట్‌లో సామ్? ధరించిన చీర, దాని ధర గురించి ఆసక్తికరమైన విషయాలు తెలుసుకుందాం. సినిమా అంటేనే గ్లామర్, విలాసం. అయితే 'మా ఇంటి బంగారం' ప్రమోషన్లలో నటిస్తున్న హీరోయిన్ మాత్రం చాలా పద్ధతిగా, ఎంతో హుందాగా చీరకట్టులో మెరుస్తోంది. ముఖ్యంగా ఆమె ధరించిన ఆ లైమ్ గ్రీన్ ఆర్గాంజా చీర లుక్ అందరినీ ఫిదా చేస్తోంది. అసలు ఆ చీర ఎక్కడిది? దాని ధర ఎంత? ఈ లగ్జరీ ఎథ్నిక్ లుక్ వెనుక ఉన్న ప్రత్యేకతలేమిటో ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం!

**చీరలో దాగున్న సింప్లిసిటీ మరియు రాయల్ లుక్**

'మా ఇంటి బంగారం' సినిమా ప్రమోషన్లలో పాల్గొంటున్న సమంత, ఈ సినిమా కోసం ఒక ప్రత్యేకమైన లుక్‌ని ఎంచుకున్నారు. ఆ మహిళ ఇంటికి సంపదను తీసుకొచ్చే వ్యక్తిగా పరిచయం ఇస్తూ, ప్రతి ప్రమోషనల్ ఈవెంట్‌లోనూ చీరకట్టులోనే కనిపిస్తూ సందడి చేస్తోంది. ఈ క్రమంలో ఆమె ధరించిన చీరలు, నగలు ఇప్పుడు నెట్టింట చర్చనీయాంశంగా మారాయి. తాజాగా జరిగిన ఒక ఈవెంట్‌లో ఆమె ధరించిన లైమ్ గ్రీన్ ఆర్గాంజా చీర ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ చీర ప్రముఖ బ్రాండ్ 'లజ్జో సి' (ఝుయిశీ జ) వారి కలెక్షన్‌కు చెందినది. ఎంతో తాజాదనాన్ని, సొగసును ఇచ్చే ఈ చీర చూడటానికి చాలా సింపుల్‌గా ఉన్నా, దాని ఫినిషింగ్ మాత్రం రిచ్ లుక్‌ని ఇస్తుంది. లేత రంగు, తేలికపాటి ఫ్యాబ్రిక్ దీని ప్రత్యేకత. చీర కొంగుపై సున్నితమైన పూల పనితనం ఉండగా, అంచున గోటా డిటైలింగ్ చూడముచ్చటగా ఉంది. భారీగా లేకుండా, చాలా సున్నితంగా డిజైన్ చేయడం ఈ చీరలోని హైలైట్.

**లక్షకు పైగా ధర..**

ఈ చీర ధరను బ్రాండ్ వర్గాలు వెల్లడించాయి. కేవలం చీర ధరనే రూ. 79,900గా నిర్ణయించారు. దీనికి జతగా అదే బ్రాండ్‌కు చెందిన మ్యాచింగ్ బనారస్ సిల్క్ బ్లౌజ్‌ను ధరించారు. ఈ బ్లౌజ్ ధర రూ. 36,900. స్టైలిష్‌గా ఉన్న వీ-నెక్ లైన్, చేతులపై బంగారు దారంతో చేసిన మారోడి ఎంబ్రాయిడరీ పనితనం బ్లౌజ్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వెరసి, చీర మరియు బ్లౌజ్ కలిపి మొత్తం రూ. 1,16,800 విలువైన ఈ దుస్తులు ఆమెకు ఒక లగ్జరీ ఎథ్నిక్ లుక్‌ని ఇచ్చాయి.

చీర వైభవం బయటకు కనిపించేలా, ఆమె ఎంపిక చేసుకున్న యాక్సెసరీస్ చాలా తక్కువగా ఉన్నాయి. చూడగానే ఆకట్టుకునే చిన్నపాటి నెక్లెస్, దానికి తగ్గట్టుగా చెవి రింగులు, చేతికి గాజులు ధరించారు. మేకప్ కూడా చాలా సింపుల్‌గా ఉంచి, చిన్న బ్లాక్ హెడ్‌బ్యాండ్‌తో తన లుక్‌ని పూర్తి చేశారు. మొత్తం మీద, ఈ ప్రమోషన్లలో ఆమె కనిపిస్తున్న తీరు, ఆమె ఎంచుకుంటున్న దుస్తులు అభిమానులను విశేషంగా అలరిస్తున్నాయి. సినిమాపై అంచనాలను పెంచడంలో ఈ ప్రమోషనల్ ఈవెంట్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి.

# స్మృతి, షఫాలీ ఊచకోత.. టీ20 వరల్డ్ కప్‌లో టీమిండియా భారీ రికార్డ్..

భారత ఓపెనర్ల అటాకింగ్ గేమ్ చూస్తుంటే నెదర్లాండ్స్‌కు ఈ మ్యాచ్‌లో భారీ లక్ష్యం తప్పేలా లేదు. పవర్‌ప్లేలోనే ప్రత్యర్థిని మానసికంగా దెబ్బతీసిన టీమిండియా, ఈ గ్రూప్-ఎ మ్యాచ్‌లో భారీ విజయాన్ని అందుకొని నెట్ రన్ రేట్‌ను మరింత మెరుగుపరుచుకోవాలని చూస్తోంది. ఇదే ఫామ్ కొనసాగితే భారత్‌కు ఈ టోర్నీలో తిరుగుండదనే చెప్పాలి. ఐసీసీ ఉమెన్స్ టి20 వరల్డ్ కప్ 2026 గ్రూప్-ఎ మ్యాచ్‌లో భారత మహిళల జట్టు సరికొత్త చరిత్ర సృష్టించింది. లీడ్స్‌లోని హెడింగ్లే వేదికగా నెదర్లాండ్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో భారత ఓపెనర్లు స్మృతి మంధాన, షఫాలీ వర్మ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయారు. కేవలం 5.1 ఓవర్లలోనే జట్టు స్కోరును 50 పరుగుల మార్కు దాటించి, ఉమెన్స్ టీ20 ప్రపంచకప్‌లో భారత్ తరపున జాయింట్-ఫాస్టెస్ట్ టీమ్ ఫిఫ్టీ రికార్డును సమం చేశారు.

**పవర్‌ప్లేలో పరుగుల వరద.. డచ్ బౌలర్లకు చుక్కలు..**

టాస్ గెలిచిన నెదర్లాండ్స్ జట్టు మొదట ఫీల్డింగ్ ఎంచుకుని బహుశా పెద్ద తప్పే చేసింది. టీమిండియా ఓపెనర్లు స్మృతి మంధాన, షఫాలీ వర్మ తొలి ఓవర్ నుంచే డచ్ బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. మైదానం నలుమూలలా బౌండరీల వర్షం కురిపిస్తూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. ఐరిస్ జ్విల్లింగ్, ఇసాబెల్ వోనింగ్ వేసిన ఓవర్లలో షఫాలీ, స్మృతి వరుస ఫోర్లతో స్టేడియాన్ని హోరెత్తించారు. ముఖ్యంగా 5వ ఓవర్ ముగిసేసరికి భారత్ వికెట్



నష్టపోకుండా 48 పరుగులు చేయగా, 6వ ఓవర్ మొదటి బంతికే ఈ జోడి జట్టు హాఫ్ సెంచరీని పూర్తి చేసింది.


**ఆరేళ్ల నాటి రికార్డు సమం.. హిస్టరీ రిపీట్స్!**

కేవలం 5.1 ఓవర్లలోనే భారత్ 50 పరుగుల మార్కును అందుకోవడం విశేషం. ఉమెన్స్ టి20 వరల్డ్ కప్ చరిత్రలో భారత్‌కు ఇదే అత్యంత వేగవంతమైన ఫాస్టెస్ట్ టీమ్ హాఫ్ సెంచరీ. గతంలో 2020 ఎడిషన్‌లో పెర్త్ వేదికగా బంగ్లాదేశ్‌పై టీమిండియా సరిగ్గా 5.1 ఓవర్లలోనే ఈ మైలురాయిని అందుకుంది. ఇప్పుడు మళ్లీ 2026 ప్రపంచకప్‌లో నెదర్లాండ్స్‌పై అదే మ్యాజిక్‌ను రిపీట్ చేస్తూ ఆ రికార్డును సమం చేసింది.

**క్రీజులో సెటిలైన ఓపెనర్లు..**

ప్రస్తుతం భారత్ 5.4 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 57 పరుగులు చేసింది. క్రీజులో షఫాలీ వర్మ 15 బంతుల్లో 5 ఫోర్లతో 25 పరుగులు, స్మృతి మంధాన 19 బంతుల్లో 4 ఫోర్లతో 23 పరుగులతో ఆడుతున్నారు. డచ్ బౌలర్ మిర్తే వాన్ డెన్ రాడ్ ఒత్తిడిలో వరుసగా వైడ్లు వేస్తూ భారత స్కోరుకు అదనపు పరుగులు ఇస్తోంది. తొలి మ్యాచ్‌లో పాకిస్తాన్‌ను చిత్తు చేసిన భారత్, అదే జోష్‌ను ఈ మ్యాచ్‌లోనూ కొనసాగిస్తూ భారీ స్కోరు వైపు దూసుకెళ్తోంది. భారత ఓపెనర్ల అటాకింగ్ గేమ్ చూస్తుంటే నెదర్లాండ్స్‌కు ఈ మ్యాచ్‌లో భారీ లక్ష్యం తప్పేలా లేదు. పవర్‌ప్లేలోనే ప్రత్యర్థిని మానసికంగా దెబ్బతీసిన టీమిండియా, ఈ గ్రూప్-ఎ మ్యాచ్‌లో భారీ విజయాన్ని అందుకొని నెట్ రన్ రేట్‌ను మరింత మెరుగుపరుచుకోవాలని చూస్తోంది. ఇదే ఫామ్ కొనసాగితే భారత్‌కు ఈ టోర్నీలో తిరుగుండదనే చెప్పాలి.

# భారత గడ్డపై పుట్టి, ఆసీస్ తరపున ఎంట్రీ.. డెబ్యూతోనే బంగ్లాను భయపెట్టిన నిఖిల్ చౌదరి..!




భారతదేశంలో పుట్టి, ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని ఆస్ట్రేలియా జాతీయ జట్టు క్యాప్ ధరించడం నిఖిల్ చౌదరి పట్టుదలకు నిదర్శనం. భవిష్యత్తులో అతను కంగారూల జట్టులో మరిన్ని అద్భుతాలు సృష్టించి భారతీయుల కీర్తిని అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టాలని ఆశిద్దాం. భారత గడ్డపై పుట్టి, కంగారూల దేశంలో క్రికెట్ సామ్రాజ్యాన్ని ఏలడం అంటే సామాన్యమైన విషయం కాదు. తాజాగా ఢిల్లీలో జన్మించిన నిఖిల్ చౌదరి ఆస్ట్రేలియా జాతీయ జట్టు తరపున అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లో అరంగేట్రం చేసి సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఈ అద్భుత ప్రయాణం ప్రతి ఒక్క క్రీడాభిమానికి స్ఫూర్తిని నింపుతోంది.

**చరిత్ర సృష్టించిన నిఖిల్ చౌదరి.. ఎలైట్ లిస్ట్‌లో చోటు!**

ఆస్ట్రేలియా క్రికెట్ చరిత్రలో ఒక అరుదైన ఘట్టం ఆవిష్కృతమైంది. భారత్‌లో పుట్టి, ఆస్ట్రేలియా జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న మూడో క్రికెటర్‌గా ఆల్‌రౌండర్ నిఖిల్ చౌదరి సరికొత్త రికార్డు నెలకొల్పాడు. బంగ్లాదేశ్‌లోని చటోగ్రామ్ వేదికగా జరుగుతున్న మొదటి టీ20 మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ప్లేయింగ్ ఎలెవన్‌లో నిఖిల్‌కు చోటు దక్కింది. బంగ్లాదేశ్‌తో జరిగిన వన్డే సిరీస్‌ను 1-2తో కోల్పోయిన కంగారూలు, ఈ టీ20 సిరీస్‌ను విజయంతో ప్రారంభించాలనే పట్టుదలతో ఉన్నారు. ఈ కీలక సమయంలో నిఖిల్ చౌదరి జట్టులోకి రావడం విశేషం. కాగా, తొలి మ్యాచ్‌లోనే ఇటు బౌలింగ్‌లో ఒక వికెట్ తీసి, అటు బ్యాటింగ్‌లో కీలకమైన 18 పరుగులతో ఆకట్టుకున్నాడు. గతంలో గుజరాత్‌లో జన్మించిన రెక్స్ సెల్లర్స్, పుణేలో జన్మించిన మహిళా క్రికెట్ దిగ్గజం లిసా స్థాలేకర్ మాత్రమే భారత్ నుంచి వెళ్లి ఆస్ట్రేలియాకు ఆడారు. ఇప్పుడు వారి సరసన నిఖిల్ చేరి ఆస్ట్రేలియా క్రికెట్ చరిత్రలో ఎలైట్ లిస్ట్‌లో స్థానం సంపాదించుకున్నాడు.

**పంజాబ్ నుంచి ఆస్ట్రేలియా దాకా.. ఒక సినిమా లాంటి ప్రయాణం..**

ఢిల్లీలో జన్మించిన నిఖిల్ చౌదరి ప్రయాణం ఎంతో ఆసక్తికరంగా సాగింది. భారత్‌లో ఉన్నప్పుడు అతను పంజాబ్ స్టేట్ టీమ్ తరపున 14 లిమిటెడ్ ఓవర్ల మ్యాచ్‌లు ఆడాడు. ఆ సమయంలో హర్భజన్ సింగ్, శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ వంటి స్టార్ ఆటగాళ్లతో కలిసి నిఖిల్ డ్రెస్సింగ్ రూమ్‌ను పంచుకున్నాడు. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ జట్టుకు ట్రయల్స్ కూడా ఇచ్చాడు. ఆ తర్వాత ఢిల్లీ క్యాపిటల్స్ సెటప్‌లో కూడా భాగమయ్యాడు. అలాగే బెల్జియంలో జరిగిన ఈయూ టీ20 టోర్నమెంట్‌లో జేబీ బ్రూగెస్ జట్టు తరపున మెరిశాడు. అయితే కరోనా మహమ్మారి సమయంలో క్వీన్స్‌లాండ్‌లోని తన బాబాయ్ ఇంటికి వెళ్లిన నిఖిల్, ఇంటర్నేషనల్ బార్డర్స్ క్లోజ్ కావడంతో అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. ఆ విపత్కర పరిస్థితులను నిఖిల్ తన కెరీర్‌కు ప్లస్ పాయింట్‌గా మార్చుకున్నాడు. అక్కడే ఉంటూ ఆస్ట్రేలియాలో తన క్రికెట్ కలలను నిజం చేసుకోవడానికి కష్టపడ్డాడు. బిగ్ బాష్ లీగ్‌లో స్థానిక జట్లకు ఆడుతూ తన అద్భుతమైన ఆల్‌రౌండ్ ప్రతిభతో సెలక్టర్ల దృష్టిని ఆకర్షించాడు.

**సెలక్టర్ల నమ్మకం.. నిఖిల్ ఒక అద్భుత ఆల్‌రౌండర్..**

ఆస్ట్రేలియా చీఫ్ సెలక్టర్ టోనీ డోడెమైడ్ నిఖిల్ చౌదరి ప్రతిభపై పూర్తి నమ్మకం వ్యక్తం చేశారు. "నిఖిల్ గత కొంతకాలంగా మా జాతీయ సెలక్టర్ల పర్యవేక్షణలో ఉన్నాడు. ట్రావిస్ హెడ్ స్థానంలో అతనికి జట్టులో అవకాశం కల్పించాం. బిగ్ బాష్ లీగ్ (దీదీూ) లో అతని ప్రదర్శన మమ్మల్ని ఎంతగానో ఆకట్టుకుంది. బంగ్లాదేశ్ పర్యటన నిఖిల్‌కు ఒక గొప్ప అనుభవాన్ని ఇస్తుంది" అని డోడెమైడ్ పేర్కొన్నారు. మూడు మ్యాచ్‌ల ఈ టీ20 సిరీస్‌లో జూన్ 19న రెండో మ్యాచ్, జూన్ 21న చివరి మ్యాచ్ జరగనున్నాయి.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com